


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 02 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 78 పేజీలు : 4 వెల : రూ 3-00


# సామాన్యులలో అసామాన్య ప్రతిభకు సత్కారం



విజయవాడ సోమవారం నాడు విజయవాడ ఏ కన్వేన్ష్ సెంటర్ లో జరిగిన వైయస్సార్ లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డులు, వైయస్సార్ అచీవ్మెంట్ అవార్డుల ప్రధానోత్సవంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి పాల్గోన్నారు.

ఈ సందర్భంగా సీఎం వైయస్.జగన్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు.. ఈ రోజు మానసీయ గవర్నర్ గారు, అమ్మ(శ్రీమతి వైయస్.విజయమ్మ), ఎందరో మహానుభావుల మధ్య.. సామాన్యులగా ఉన్న అసామాన్యులు మధ్య నా సమయం గడుపుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు. నా తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున, తెలుగు జాతి తరపున అందరికీ వందనాలు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలని అన్నారు.

దేశ అత్యున్నత అవార్డుల తరహాలోనే...

కేంద్ర ప్రభుత్వం ఏటా వివిధ రంగాలలో గొప్పవారిని, మంచివారిని దేశంలోని అత్యున్నత అవార్డులైన పద్మశ్రీ, పద్మభూషణ్ , భారతరత్న వంటి అవార్డులిచ్చి సత్కరిస్తుంది. మనందరి ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమమే చేపట్టి, రాష్ట్ర అవార్డులు కూడా ఇస్తే బాగుంటుందని పలు సూచనలు ఇచ్చిన నేపధ్యంలో వైయస్సార్ అవార్డులను నెలకొల్పటం జరిగింది.

డాక్టర్ వైయస్సార్? నిండైన తెలుగుదనం

మహానేత, నాన్నగారు డాక్టర్ వైయస్సార్ గారు పేరు చెబితే అందరికీ కొన్ని విషయాలు గుర్తుకు వస్తాయి. నిండైన తెలుగుదనం తన పంచకట్టులో కనిపిస్తుంది. వ్యవసాయం మీద మమకారం తన ప్రతి అడుగులోనూ కనిపిస్తుంది. గ్రామం, పల్లెల మీద పేదల మీద అభిమానం కూడా తనను చూస్తూనే కనిపిస్తాయి. ప్రతి ఒక్కరినీ పెద్ద చదువులు చదివించాలన్న తపన, ప్రతి ఒక్కరి ప్రాణాన్ని నిలబెట్టాలన్న ఆరాటం ఇవన్నీ కూడా నాన్నగారిని చూస్తేనే కనిపించే విషయాలని అయన గుర్తు చేసుకున్నారు.

అకాశమంత ఎత్తుకు ఎదిగిన మహామనిషి....అనేక విషయాలు ఆయన్ని చూస్తేనే గుర్తుకు వస్తాయి. భూమి మీద ఉంటూ... ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన ఆ మహామనిషి ఈరోజు మన మధ్య లేకపోయినా, అంత గొప్పవాడు, మహానుభావుడు కాబట్టే ఆయన పేరుమీద రాష్ట్ర స్థాయిలో అత్యున్నత పౌర పురస్కారాలను ఇవ్వాలని వైఎస్సార్ లైఫ్టైం అచీవ్మెంట్ అవార్డులు, వైఎస్సార్ అచీవ్మెంట్ అవార్డులు ఇస్తున్నామని ప్రకటించాం. ఇందులో లైఫ్టైం అచీవ్మెంట్ అవార్డులు ప్రకటించిన వారికి రూ. 10 లక్షలు, కాంస్య విగ్రహం, మెమొంటో, యోగ్యతా పత్రం ఇస్తున్నాం. అచీవ్మెంట్ అవార్డులు పొందినవారికి రూ. 5 లక్షలు, కాంస్య విగ్రహం, మెమొంటో, యోగ్యతా పత్రం ఇస్తున్నాం.

ప్రతి పనిలోనూ పారదర్శకతతో....

గర్వంగా మరోసారి ఇంకో విషయం చెబుతున్నాను. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ కార్యక్రమం చూసినా, గ్రామ సచివాలయాల్లో లక్షా 30 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడం దగ్గరనుంచి మొదలుపెడితే.. ప్రతి సంక్షేమపథకం కూడా, ప్రతి పేదవాడికి అత్యంత పారదర్శకంగా ఇవ్వగలిగే వ్యవస్థని తీసుకొనిరావడం మొదలు.. ఈరోజు ఈ అవార్డుల ఎంపికలో కూడా కులం చూడలేదు. మతం చూడలేదు. ప్రాంతం చూడలేదు. చివరకి వారి రాజకీయ పార్టీలను, రాజకీయ భావాలను కూడా చూడలేదు. మనిషిని ఒక మనిషిగానే చూశాం. విభేదించే భావాలున్నా మనుషుల్లో మహామనుషులను చూశాం.

అసామాన్యులకు సలామ్ చేస్తూ రాష్ట్ర చరిత్రలోనే అత్యంత పారదర్శకంగా అవార్డులను ఇస్తున్నాం. ఇది మన తెలుగుకి, సంస్కృతికి, కళలకు, మనలో ఉన్న మానవతా మూర్తులకు ఇస్తున్న గొప్ప అవార్డులగానే భావిస్తున్నాం. ఎందరెందరికో స్ఫూర్తినిస్తున్న మహోన్నత సంస్థలకు, వ్యక్తులకు ఈ అవార్డులు ఇస్తున్నాం. సామాన్యులగా కనిపించే అసామాన్యులకు వందనం చేస్తూ... వారి వెలకట్టలేని ప్రతిభకు సలామ్ చేస్తూ ఈ ఆవార్డులను ప్రకటించాం. తెలుగువారికి, ఆంధ్రప్రదేశ్కి బ్రాండ్ అంబాసిడర్లైన, కళలకు, సంస్కృతికి ఈ ఆవార్డులలో పెద్దపీట వేసామని అన్నారు.

ప్రతి కళకు....

## తొలిసారిగా వైఎస్ఆర్ లైఫ్టైం అచీవ్మెంట్ అవార్డులు, అచీవ్మెంట్ అవార్డులు



ఒక డప్పు కళాకారుడికి, ఒక తోలుబొమ్మలాటకు, పొందూరు ఖాదీకి, జానపద గీతానికి, బొబ్బిలి వీణకు, రంగస్థల పద్యానికి, థింసా నృత్యానికి, సురభి నాటకానికి, సవర చిత్రకళకు, వీధి నాటకానికి, హరికథకు, బుర్రకథకు, వెంటకగిరి జాంధానీ చీరకు, మనదైన కలంకారీకి, చెక్కమీద చెక్కే శిల్పానికి, నాదస్వరానికీ, మనదైన కూచిపూడికి ఇస్తున్న అవార్డులు ఇవని అన్నారు.

గొప్ప సంస్థలకూ....

అలాగే వందేళ్ల చరిత్ర ఉన్న ఎంఎస్ఎన్ ఛారిటీస్ వారికి, సీపీ బ్రౌన్ లైబ్రరీకి, వేటపాలెం గ్రంథాలయానికి, ఆర్డీటీ సంస్థకి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్.. ఇటువంటి గొప్ప గొప్ప సంస్థలకు వారి సేవలకు ఇస్తున్న ఆవార్డులు ఇవి.

రైతుకు... కలం యోధులకూ అవార్డులు...

పండించే రైతన్నకు మనదైన వ్యవసాయానికి, ఉద్యానవన ఉద్యమానికి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న విప్లవానికి ఇస్తున్న అవార్డులు కూడా ఇవి. కలంయోధులైన కవులకు, స్త్రీవాద ఉద్యమానికి, సామాజిక స్పృహను మేల్కొల్పడంలో మేరుపర్వత సమానులైన రచయితలకు, విశ్లేషక పాత్రికేయలకు ఇస్తున్న అవార్డులు కూడా ఇవని అయన అన్నారు.

# జాతీయ జెండా ఆవిష్కరించిన సీఎం జగన్

## సీఎం క్యాంప్ కార్యాలయంలో ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలు

## పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన సీఎం



అమరావతి: ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ సమీర్ శర్మ, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, శంకరనారాయణ, వెల్లంపల్లి శ్రీనివాస్, తానేటి వనిత, గుమ్మనూరి జయరాం, అవంతి శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, తెలుగు అకాడమీ చైర్మన్ లక్ష్మీ పార్వతి, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీ నందిగం సురేష్ పాల్గొన్నారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సీఎం వైఎస్ జగన్.. ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పొట్టి శ్రీరాములు త్యాగఫలంతో పాటు అనేక మంది పోరాట ఫలితంతో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అదే అంకితభావం, చిత్తశుద్ధి, దృఢ సంకల్పం కొనసాగించడం ద్వారా రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్దామన్నారు.

# ఆర్బీకే స్థాయి.. ఫాంగేట్ వద్దే ధాన్యం కొనుగోలు: సీఎం జగన్



తాడేపల్లి: ధాన్యం సేకరణ, కొనుగోళ్లపై మంత్రుల బృందంతో కలిసి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణపై పటిష్ట విధానంతో ముందుకెళ్లాలని.. ఆర్బీకేల స్థాయిలో, ఫాంగేట్ వద్దే కొనుగోలు చేయాలని తెలిపారు. మోసాలు, అవినీతికి తావులేకుండా అత్యంత పారదర్శక విధానం అమలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర తొలగించామని.. రైతుకు మంచి ధర వచ్చేలా చూసేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు సీఎం జగన్ తెలిపారు.సమావేశంలో ఖరీఫ్లో వరి సాగు, దిగుబడులపై అధికారులు వివరాలు అందించారు. 15.66 లక్షల హెక్టార్లలో వరి సాగుచేశారని అంచనాలు వెల్లడించారు. దాదాపు 87లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి ఉంటుందని అధికారుల అంచనా వేశారు. దీంట్లో దాదాపు 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉంటుందని అంచనా వేశారు. 6,884 ఆర్బీకేల పరిధిలో వరిని సాగు చేసినట్టుగా అధికారులు వివరాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ వెల్లడించిన అంశాలు..

ఆర్బీకేల స్థాయిలోనే ధాన్యం సేకరణ కేంద్రాలు.

పేమెంట్స్లో తప్పిదాలు లేకుండా, మోసాలు లేకుండా, వేగంగా పేమెంట్లు చేయడానికి వీలుగా ఇ?క్రాప్ బుకింగ్, ఈ కేవైసీ.

వ్యవసాయ సలహా మండళ్లు, వీఏఏలు, వాలంటీర్లతో అవగాహన పెంచే కార్యక్రమాలు.

ఆధార్ నంబర్ ఆధారంగా చెల్లింపులు.

ధాన్యంసేకరణలో అక్రమాలు, అవకతవకలకు ఆస్కారం ఉండకూడదు.

ధాన్యం నాణ్యతను నిర్ధారించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండేలా గట్టి చర్యలు తీసుకోవాలి.

ధాన్యం సేకరణలో రైతులకు మేలు చేసేలా కొత్త విధానంలోకి వెళ్తున్నాం.

దీన్నొక సవాల్గా తీసుకుని, అన్నిరకాలుగా సిద్ధంకావాలి.

ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కల్పించడానికి వాలంటీర్లు, ఆర్బీకేల ద్వారా కరపత్రాలను ప్రతి రైతు ఇంటికీ ఇవ్వాలి.

అలాగే ధాన్యం సేకరణపై వివరాలతో కూడిన బోర్డును ఆర్బీకేల్లో ఉంచాలి.

మంచి ధర పొందడానికి తగిన సలహాలు, సూచనలు కూడా అందించేలా ఈ కరపత్రాలను రూపొందించాలి.

ఎలాంటి మినహాయింపులు లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో కనీస మద్దతు ధర అందాలి.

ఈ సమీక్షా సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), గృహనిర్మాణశాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, అగ్రి మార్కెటింగ్ ముఖ్య కార్యదర్శి వై మధుసూధన్రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ గిరిజాశంకర్, మార్కెటింగ్ స్పెషల్ కమిషనర్ పీ ఎస్ ప్రద్యుమ్న, ఏపీఎస్సీఎస్సీఎల్ వీసీ అండ్ ఎండీ జీ వీరపాండ్యన్, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హెచ్ అరుణ్కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## విశాఖ స్టీల్ప్లాంట్ విషయంలో వైసీపీ ద్వంద వైఖరి: చంద్రబాబు

అమరావతి: విశాఖ స్టీల్ప్లాంట్ విషయంలో వైసీపీ ద్వంద వైఖరి అవలంభిస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబు దుయ్యబట్టారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అఖిపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంతో రైతులకు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రూ. 4 వేల కోట్ల బియ్యం కుంభకోణంపై విచారణ జరపాలన్నారు. పెట్రోల్, డీజిల్పై వ్యాట్, సెస్ తగ్గించే వరకు పోరాటం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అప్పుల కోసం గవర్నర్ సార్వభౌమాధికారాలనూ తాకట్టు పెట్టారని తప్పుబట్టారు. ఉపాధి కూలీలకు నెలల తరబడి వేతనాలివ్వకపోవడం దుర్మార్గమన్నారు. నీరు-చెట్టు, నరేగా బిల్లులు తక్షణమే విడుదల చేయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. "ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఓటర్లు ఏకమై వైసీపీని ఓడిస్తేనే రివర్స్ పాలనకు గండి పడుతుంది.

# వైద్యరంగంలో మానవవనరుల కొరతను అధిగమించడం తక్షణావసరం: ఉపరాష్ట్రపతి

## సాంకేతికతను సద్వినియెగం చేసుకుంటూ 'టెలిమెడిసిన్' సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

## డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఫౌండేషన్లో ఆక్సిజన్ ప్లాంట్ ను ప్రారంభించి, వైద్య విద్యార్థులతో ఇష్టాగోష్టిలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి




విజయవాడ వైద్యరంగంలో నెలకొన్న మానవవనరుల కొరతను వీలైనంత త్వరగా అధిగమించడంపై దృష్టిసారించడం తక్షణ అవసరమని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. వైద్యరంగంలోని ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో మౌలికవసతులను మెరుగుపరుచుకోవడం, వైద్యులు, వైద్య సిబ్బంది సంఖ్యను పెంచుకోవాల్సిన అవసరాన్ని కరోనా మహమ్మారి గుర్తుచేసిందని ఉపరాష్ట్రపతి అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాల ఆక్సిజన్ ప్లాంట్ ను ఇతర సదుపాయాలను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి, అనంతరం వైద్య విద్యార్థులతో ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు. వైద్యులు, రోగుల నిష్పత్తి విషయంలో భారతదేశంలో చాలా అంతరం ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. 2024 నాటికి డబ్ల్యూహెచ్వో సూచించినట్లుగా ప్రతి వెయ్యిమంది రోగులకు ఒక వైద్యుడు ఉండే దిశగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండటం అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ వైద్య మౌలిక వసతుల మిషన్ ద్వారా గ్రామాల నుంచి పట్టణాల వరకు అత్యవసర వైద్యసేవలకోసం జరుగుతున్న ఏర్పాట్లు వచ్చే 4-5 ఏళ్లలో పూర్తవుతుండటం శుభపరిణామమన్నారు. వైద్య రంగం వాణిజ్యపరమైన అంశంగా మారుతున్న నేపథ్యంలో రోగులకు చికిత్సనందించే విషయంలో కాస్త మానవీయ దృక్కోణంలో ఆలోచించాలని ఉపరాష్ట్రపతి సూచించారు. వైద్య వృత్తి పవిత్రమైనదని, ఈ వృత్తి పవిత్రతతను కాపాడటంలో తమ వంతు బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించేందుకు, ఉన్నతస్థాయి విలువలను కాపాడటంలో వైద్యవిద్యార్థులు భాగస్వాములు కావాలి అని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైద్యులకు తొలి ప్రమోషన్ కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడాన్ని తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉందని కూడా ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వైద్యులు గ్రామీణప్రాంతాలకు వచ్చేలా.. ఆ ప్రాంతాల్లో కనీస నివాస సదుపాయాల కల్పన కూడా అవసరమన్నారు.ఐటీ రంగంలో భారతదేశం సాధిస్తున్న సాంకేతిక ప్రగతిని సద్వినియోగం చేసుకోవాల్సిన విషయాన్నీ ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. వివిధ అంశాల్లో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాలు (పీపీపీ) పెరగాల్సిన అవసరముందని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను మెరుగుపరిచేందుకు 'టెలిమెడిసిన్'అనుసంధానతను పెంచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. టెలిమెడిసిన్ ద్వారా వైద్య ఖర్చులు తగ్గడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వారికి కనీస వైద్యసేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. ఆరోగ్య బీమా కోసం ప్రధానమంత్రి ప్రారంభించిన 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్', ఇతర కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయుక్తం అవుతాయన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్లీ ఎన్నికల సందడి

## నెల్లూరు కార్పోరేషన్ తో పాటు 12 మున్సిపాల్టీలకు ఎన్నికలు

## తాజాగా షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

## ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదల

విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. మరోసారి ఎన్నికల సంగ్రామం మొదలైంది. ఏపీ వ్యాప్తంగా 13 చోట్ల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా షెడ్యూల్ విడుదల చేసింది. నెల్లూరు కార్పొరేషన్ తో పాటు 12 మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అలాగే 15న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏపీలోని నెల్లూరు కార్పొరేషన్ తో పాటూ బుచ్చిరెడ్డిపాలెం ఆకివీడు జగ్గయ్యపేట కొండపల్లిలో ఎన్నికలు జరుగుతాయి. గురజాల దాచేపల్లి దర్శి కుప్పం బేతంచెర్ల కమలాపురం రాజంపేట పెనుకొండ మున్సిపాల్టీలకు ఎన్నికలు ఉన్నాయి.. 533 వార్డులు 85 ఎంపీటీసీలు 11 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 14 1516 తేదీలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి.పంచాయతీలకు ఈ నెల 14న పోలింగ్ అదే రోజు కౌంటింగ్ జరగనుంది. మున్సిపాలిటీలు కార్పొరేషన్లకు ఈనెల 15న పోలింగ్ 17న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఎంపీటీసీ జెడ్పీటీసీలకు ఈ నెల 16న పోలింగ్ 18న కౌంటింగ్ జరపనున్నారు.కోర్టు కేసులు మరికొన్ని కారణాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆ ఎన్నికలు ఎన్నికల సంఘం తాజాగా కసరత్తు చేస్తోంది. 2019 ఎన్నికల నుంచి ఏపీలో అన్ని ఎన్నికల్లోనూ వైసీపీ ఘన విజయాన్ని అందుకుంటోంది.

# సంపాదకీయం

మంగళవారం 02 నవంబరు 2021

## చర్చలతోనే పరిష్కారం

భారత్?చైనా సంబంధాలలో ఎన్ని ఘర్షణలు చోటు చేసుకుంటున్నా, ఇరుదేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను వీలైనంతవరకు కొనసాగించడమే ఉత్తమం. 'హిందీ? చీనీ భాయి భాయి' అనే నినాదం స్థానంలో 'హిందీ?చీనీ బైబై' అనే నినాదానికి ప్రాచుర్యం ఇస్తున్న వారు ఈ ప్రపంచం మొత్తంగా పరస్పరాధారితం అనే వాస్తవాన్ని మర్చిపోతున్నారు. ప్రపంచీకరణ ఏదో ఒక రూపంలో దేశాలన్నింటికీ ఏకం చేసింది. ఈ నేపథ్యంలో దేశాల నడుమ పొర పొచ్చాలు ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రజల పాలిట శాపాలు కారాదు. ఇరు దేశాల ప్రజల అవసరాలు తీర్చడంలో అవి అడ్డంకులు కారాదు. ఈ ఎరుకతో పరస్పరం ప్రతి దేశం మరో దేశంతో పూర్తి సంయమనంతో అన్నింటా పాటించగలిగితే అది ఇరు దేశాల ప్రజల అభివృద్ధికి, అవసరాల్లో ఆదుకోవడానికి ఎంతైనా దోహదకారి అవుతుంది.స్వతంత్ర దేశంపై మరొక దేశం దురాక్రమణ ఆక్షేపణీయం. దాన్ని ఆయా రీతులలో అన్నివిధాలా ఎదుర్కోవలసిందే. మన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవలసినదే. కానీ దాని పేరుతో సమస్త సంబంధాలను విచ్ఛిన్నం చేసుకోనవసరం లేదు. సాకు దొరికింది కదా అని గతంలోని వాటిని తవ్వి తలకెత్తుకుని ఆడిపోసుకోనవసరం లేదు. మానవీయ సంబంధాలకు ఈపేరుతో ఉద్వాసన పలకనవసరం లేదు. దేశాల మధ్య పరస్పర సంబంధాలను కాదనటం, కాలదన్నటం అనైతికం. ఇది అమాయక ప్రజలలో దాగున్న భావోద్వేగాలను రెచ్చగొట్టడం తప్ప మరొకటి కాదు. తాజా తార్కాణం మన దేశం చైనాతో 2021లో విదేశీ వాణిజ్యం 100 బిలియన్ల డాలర్లు దాటుతూ ఉండటం. ఇంత పెద్ద స్థాయిలో పరస్పర వాణిజ్యం జరగడం ఇదే తొలిసారి. చైనా ప్రభుత్వ కస్టమ్స్ పాలనా విభాగం డేటా ప్రకారం చైనా భారత్ మధ్య వాణిజ్యం ఈ తొమ్మిది నెలల్లో గతంలో కన్నా 49 శాతం వృద్ధితో 90.3 బిలియన్లకు చేరింది. చైనా నుండి మన దిగుమతులు గతంలోకన్నా 51.7 శాతం వృద్ధితో 68.4 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో మన ఎగుమతులు 42.5 శాతం పెరుగుదలతో 21.9 బిలియన్ డాలర్లకు పెరిగాయి. మన రెండు దేశాల విదేశీ వాణిజ్యం కరోనా ముందు కాలం నాటి కన్నా గణనీయంగా పెరగడం గమనార్హం. ఈ గణాంక వివరాలు దేశాల నడుమ వాణిజ్య సంబంధాలకు సంకేతం. మన దేశం నుంచి చైనాకు ముఖ్య ఎగుమతులు? ఇనుప ఖనిజం, కాటన్, ఇతర ముడిసరుకులు ముఖ్యమైనవి. మన దిగుమతుల్లో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ యంత్రాలు, యంత్ర పరికరాలు, మందులు, వాటికి సంబంధించిన మూలకాలు వగైరా గత రెండేళ్లలో ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఒక దేశ అభివృద్ధి ప్రపంచ అవసరాలను తీర్చటంతో కూడా ముడిపడి ఉంటుందని స్పష్టమవుతోంది. వీటిని ఏ రూపంలో ఆటంకపరచినా అదివిశ్వ మానవాళి ప్రయోజనాలకు ద్రోహం చేసినట్లే అవుతుంది.దేశాల నడుమ పరస్పర సత్సంబంధాలు ఏ విధంగా పరస్పర ప్రయోజనకారులో తాజా గణాంకాల వివరాలు తెలుపుతున్నాయి. 'హిందీ ? చీనీ బై బై' అంటే ఇవన్నీ ఎలా సాధ్యం? సాధ్యం కాకుంటే ఇక్కడ అక్కడ ప్రజ లంతా ఏమయ్యేవారు? వారి అత్యవసరాలు/ ప్రయోజనాలు ఎలా తీరేవి? నెరవేరేవి? చైనా నుంచి యంత్రాలు, పరికరాలు, ఎలక్ట్రిక్ ఉత్పత్తులు, మందులకు సంబంధించిన ఎగుమతులు రెట్టింపుకంటే ఎక్కువగా ఉన్నాయి. భారత్‌ను దెబ్బ తీయాలని నానా ప్రయత్నాలు చేస్తున్న చైనాకు భారీ షాక్ తగలనుంది. ప్రస్తుత దీపావళి సీజన్‌లో చైనా వస్తువులను భారత వ్యాపారులు నిషేదించడంతో డ్రాగన్ దేశ ఎగుమతిదారులు కొన్ని వేల కోట్లు నష్టపోనున్నారు. ఈ దీపావళికి చైనా సరకులను బాయ్ కాట్ చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ( సీఏఐటీ) వ్యాపారులకు పిలుపునిచ్చింది. దీంతో చైనాకు సుమారు 50 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు సీఏఐటీ తెలిపింది. ఇటీవల గమనించిన ముఖ్యమైన మార్పుని పరిశీలిస్తే.. దేశంలోని ప్రధాన నగరాల్లోని వినియోగదారులు చైనీస్ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదని దీని ప్రభావంతో భారతీయ వస్తువులకు డిమాండ్‌ను పెరుగుతున్నట్లు సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ.. ఇటీవల 20 ముఖ్యమైన నగరాల్లో నిర్వహించిన సర్వేలో ఇప్పటివరకు దీపావళి వస్తువులు, బాణసంచా లేదా ఇతర వస్తువుల కోసం చైనా ఎగుమతిదారులకు భారతీయ వ్యాపారులు లేదా దిగుమతిదారులు ఎటువంటి ఆర్డర్‌లు ఇవ్వలేదని తేలింది.ఇవి ఆ దేశం నుండి రాకుంటే ఇక్కడి కోట్లాది మంది ప్రజలు ఏమై ఉండేవారు? భారత్? చైనా సంబంధాల పట్ల విషం చిమ్ముతున్న వారు ఒకవిషయం గుర్తించాలి. పరస్పర సంబంధాల విచ్ఛిన్నానికి చిన్న కారణం చాలు. వీటిని గుర్తించి గౌరవించి పాటించడమే వ్యక్తుల, వ్యవస్థల? విజ్ఞత, వివేకం, విచక్షణలకు కొలబద్ధలు. అవి ఎల్ల వేళలా అందరికీ, అందునా జనజీవనంలో ఉన్నవారికి మరింతగా ఉండాలని ఆశిద్దాం.

## వాసుపల్లికి కొత్త కుంపట్లు

విశాఖపట్టణం, నవంబర్ 1, (న్యూస్ పల్స్)రెబల్ ఎమ్మెల్యే ఊహించింది ఒకటైతే.. జరుగుతున్నది మరొకటా? పార్టీలో అసమ్మతి కుంపట్లు చెమటలు పట్టిస్తున్నాయా? చాపకింద నీరులా విస్తరిస్తున్న వ్యతిరేకత టెన్షన్ పుట్టిస్తోందా? అధిష్ఠానానికి తలనొప్పిగా మారిన ఆ నియోజకవర్గం ఎక్కడిది? అక్కడ కుమ్ములాటల కథేంటి?విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీలో మూడు ముక్కలాట ముదురుతోంది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వ్యతిరేకంగా కొత్త కుంపట్లు రాజుకుంటున్నాయి. ఇటీవల అధికారపార్టీ నిర్వహించిన జనాగ్రహదీక్ష సాక్షిగా మరోసారి అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ పంచన చేరాక.. అధికారపార్టీ అండతో బలమైన శక్తిగా ఎదగాలనే ఆలోచనలో ఉన్నారు. వాసుపల్లి రాకముందు ఇక్కడ వైసీపీకి కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీనివాస్‌ల నాయకత్వం ఉండేది. ద్రోణంరాజు మరణం తర్వాత పరిస్థితులు మారాయి. మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంతో కోలా గురువులు పోటాపోటీ రాజకీయాలకు కాస్త దూరం జరిగారు. అంతా వాసుపల్లి చేతుల్లోకి వెళ్లినట్టే కనిపించినా అది ఎక్కువకాలం కొనసాగలేదు. జీవీఎంసీ ఎన్నికల తర్వాత పరిణామాలు వేగంగా మారాయి.నియోజకవర్గం పరిధిలో 13డివిజన్లు ఉండగా.. నాలుచోట్లే గెలిచింది. టీడీపీకి 38వేల ఓట్లు వస్తే.. వైసీపీకి దక్కిన ఓట్లు 34 వేలు. వాసుపల్లి వచ్చినా.. ప్రతికూల ఫలితాలు రావడం వాసుపల్లి వ్యతిరేకులకు అస్త్రంగా మారింది. మిగిలినచోట్ల కంటే ఈ నియోజకవర్గ పరిధిలో నామినేటెడ్ పదవులు అధికంగా లభించాయి. స్థానిక నాయకత్వంలోనూ హుషారు పెరిగింది. వేదిక ఏదైనా ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తోంది స్థానిక కేడర్. ఈ పరిస్థితికి వాసుపల్లి వైఖరే కారణమని ఫైర్ అవుతున్నారు. వైసీపీలో పట్టుసాధించి బలం పెంచుకోవడానికి ఎమ్మెల్యే వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ విమర్శ.ఇటీవల అధికార, విపక్షాల మధ్య మత్తు పదార్థాలపై రచ్చ రచ్చ జరిగింది. టీడీపీ రాజకీయాలను ఎండగట్టేందుకు జనాగ్రహ దీక్షలు నిర్వహించింది వైసీపీ. ప్రతీ నియోజకవర్గంలో రెండురోజులపాటు ఎమ్మెల్యే లేదా కోఆర్డినేటర్ సమక్షంలో దీక్షలు జరిగాయి. దక్షిణ నియోజకవర్గంలో మాత్రం మూడు టెంట్లు ఏర్పాటయ్యాయి. జీవీఎంసీ ధర్నాచౌక్ దగ్గర పార్టీ ఆదేశాలతో కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు నిరసన శిబిరం తెరిచారు. ఎమ్మెల్యే వాసుపల్లి ఒకరోజు దీక్షకు పరిమితంకాగా.. ఆయన శిబిరం వేరేగా నిర్వహించారు. కోలా గురువులు ఫిషింగ్ హార్బర్లో దీక్ష చేపట్టారు. పార్టీ ముఖ్యనేతలు ఈ మూడు శిబిరాల దగ్గరకు వెళ్లక తప్పలేదు.ఎమ్మెల్యేకు కార్పొరేటర్లు, ముఖ్య నాయకులకు మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందనేది బలంగా వినిపిస్తోన్న టాక్. ఇటీవల ఆసరా కార్యక్రమ వేదికపై కార్పొరేటర్ సాధిక్ వర్సెస్ ఎమ్మెల్యే మధ్య పరోక్ష విమర్శలు వినిపించాయి. కోవిడ్ సమయంలో ఫీజు రాయితీలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే.. వాసుపల్లి కాలేజీల్లో ఆ విధానం అమలు కాలేదని సొంతపార్టీ నాయకులే విమర్శలు చేస్తున్నారు. ఆలయ కమిటీలలోనూ పంచాయితీలు జరుగుతున్నట్టు భోగట్టా. స్థానికంగా ఉండే గుడులకు పాలకమండళ్లను నియమించబోతున్నారు. ఎమ్మెల్యే కొన్ని పేర్లను సిఫారసు చేయగా.. పోటీగా కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నేతలు మరికొన్ని పేర్లను వైసీపీ పెద్దలకు ఇచ్చారట. దీంతో ఎవరి మాట నెగ్గుతుందోననే ఉత్కంఠ నెలొంది. మరి.. ఈ ప్రతికూల పరిస్థితిని వాసుపల్లి ఎంతకాలం నెగ్గుకొస్తారో చూడాలి.

## నల్లపూసైన ఎంపీ గల్లా జయదేవ్..!



గుంటూరు, నవంబర్ 1, (న్యూస్ పల్స్) ఏపీలో టీడీపీ నుంచి గెలిచిన ముగ్గురు ఎంపీలలో గల్లా జయదేవ్ ఒకరు. వైసీపీ స్వింగ్‌లోనూ.. వరసగా రెండోసారి గుంటూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. విభజన హామీలపై లోక్‌సభలో మోడీని మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ అని సంభోదించి బాగానే పాపులారిటీ సంపాదించారు జయదేవ్. టీడీపీ రాష్ట్రంలో అధికారం కోల్పోయినా కొంతకాలం దూకుడుగా వెళ్లిన ఆయన? ఇప్పుడు పూర్తిగా నల్లపూసై పోయారు. గుంటూరులో అడ్రస్ లేరు.. టీడీపీ కార్యక్రమాల్లో కనిపించడం లేదు. జయదేవే కాదు.. ఆయన తల్లి గల్లా అరుణకుమారి సైతం ఉలుకు లేదు పలుకు లేదు. దీంతో వారికేమైంది? ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు? అనేది చర్చగా మారింది.బోసడీకే అంటూ టీడీపీ నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలు ఏపీ రాజకీయాలను వేడెక్కించాయి. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ఆఫీసులపై దాడులు జరిగాయి. ఈ ఎపిసోడ్‌లో చంద్రబాబు ఏపీ టీడీపీ ఆఫీస్‌లో 36 గంటలపాటు దీక్ష చేశారు. ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలిసి వచ్చారు. వీటిల్లో ఎక్కడా గల్లా జయదేవ్ మాట వినిపించలేదు.. మనిషి కనిపించలేదు. దాడులను ఖండిస్తూ ప్రకటన లేదు. చంద్రబాబు దీక్షకు రాలేదు. చంద్రబాబుతోపాటు ఢిల్లీ వెళ్లిన బృందంలోనూ జయదేవ్ లేరు. టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన బెజవాడ ఎంపీ కేశినేని నాని మాత్రం మనసు మార్చుకుని చంద్రబాబు దీక్షకు వచ్చారు.. మాట్లాడారు. పార్టీ అధినేతతో కలిసి ఢిల్లీ వెళ్లారు. మరి.. జయదేవ్‌కు ఏమైంది అన్నదే ప్రశ్న.అమరరాజా సంస్థ గల్లా కుటుంబానిదే. తండ్రి రామచంద్రనాయుడు నుంచి పూర్తిస్థాయిలో వ్యాపార బాధ్యతలు స్వీకరించి అమరరాజా సీఎండీ అయ్యారు జయదేవ్. ఇటీవలే అమరరాజా సంస్థను సమస్యలు చుట్టుముట్టాయి. కాలుష్యాన్ని వెదజల్లుతోందని ప్రభుత్వం కన్నెర్ర చేయడంతో పొల్యూషన్ బోర్డు అధికారులు వరసగా నోటీసులు జారీ చేశారు. కాలుష్యం కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లోని నీరు కలుషితం అవుతోందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆరోపణ. ఈ వివాదం సంస్థ క్లోజర్ నోటీసులు ఇచ్చే వరకు వెళ్లింది. దీంతో హైకోర్టు తలుపు తట్టింది అమరరాజా సంస్థ. అక్కడ ఊరట లభించింది. ఈ వివాదం అలా ఉండగానే సొంతూరు చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువమాఘంలో గల్లా కుటుంబంపై భూఆక్రమణ కేసులు నమోదయ్యాయి. ఈ పరిణామాలు గల్లా కుటుంబాన్ని కలిచి వేసినట్టుగా చెబుతున్నారు. రాజకీయాల్లో ఉండటం వల్లే ఇవన్నీ జరుగుతున్నాయని గల్లా ఫ్యామిలీ ఫీల్ అవుతున్నట్టు సమాచారం. అందుకే యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరమైనట్టు ప్రచారం జరుగుతోంది.సోషల్ మీడియాలో ఎంపీ జయదేవ్ పోస్టింగ్స్ లేవు. టీడీపీతోనూ అంటీముట్టనట్టు ఉంటున్నారు. చంద్రబాబు నుంచి పార్టీ కేడర్ వరకు ఎవరితోనూ ఎంపీ టచ్‌లో లేరని టాక్. ఈ క్రమంలోనే టీడీపీ ఆఫీసులపై దాడి.. చంద్రబాబు దీక్ష.. ఢిల్లీ టూర్‌లకు జయదేవ్ దూరంగా ఉన్నారని సమాచారం. జయదేవ్ కుమారుడు గల్లా అశోక్ హీరోగా ఒక సినిమా తెరకెక్కుతోంది. ఆ సినిమా ప్రమోషన్‌లో జయదేవ్ బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది. కారణం ఏదైనా.. అరుణకుమారి టీడీపీ పొలిట్‌బ్యూరో నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవడం.. జయదేవ్ సైలెంట్ కావడంతో వారి రాజకీయ భవిష్యత్ వ్యూహం ఏంటన్నది ప్రశ్నగా మారింది. ఈ విషయంలో మిస్టర్ గల్లా జయదేవ్ కదలికలేంటో కాలమే చెప్పాలి.

## కుప్పం రిపేర్ పూర్తయినట్టేనా

తిరుపతి, నవంబర్ 1, (న్యూస్ పల్స్)అసలు కుప్పం అంటే చంద్రబాబు కంచుకోట?చంద్రబాబు కాలు పెట్టకుండా ఆయన బొమ్మ ఉంటే చాలు..కుప్పంలో టీడీపీ గెలిచేస్తుంది?గత ఏడు ఎన్నికల్లోనూ అదే పరిస్థితి?ఆయన కనీసం ప్రచారానికి కూడా వెళ్లారు. అయినా కుప్పం ప్రజలు ఏడు సార్లు బాబుని గెలిపించుకున్నారు. అలా అడుగుపెట్టే అవసరం లేకపోయిన గెలిచే చంద్రబాబుకు ఇప్పుడు ఏమైంది?వరుసపెట్టి కుప్పం వీధుల్లో పర్యటిస్తూ హడావిడి చేసేస్తున్నారు? అంటే వైసీపీ అధికారంలోకి వచ్చాక కుప్పంలో బాబుకు బొమ్మ కనబడటం మొదలైంది.పంచాయితీ ఎన్నికల్లో ఊహించని విధంగా టీడీపీ ఓడిపోయింది..దాదాపు 90 శాతం పంచాయితీలు వైసీపీ కైవసం చేసుకుంది. ఈ దెబ్బతో చంద్రబాబు కుప్పంలో ఎంట్రీ ఇచ్చి, గత మార్చిలో నియోజకవర్గం మొత్తం తిరిగారు. సరే అది పోయింది?ఇటీవలే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో సైతం కుప్పంలో వైసీపీదే పైచేయి. దాదాపు క్లీన్‌స్వీప్ చేసినంత పనిచేసింది. దీంతో బాబుకు బొమ్మ కనబడటం ఖాయమైంది.అసలు కుప్పంలో బాబు ఓడిపోయే పరిస్తితికి వచ్చారని ప్రచారం మొదలైంది. ఈ ప్రచారం?పైగా కుప్పం మున్సిపాలిటీకు ఎన్నిక జరగనుంది. దీంతో మున్సిపాలిటీని కూడా వైసీపీనే కైవసం చేసుకుంటుందని వార్తలు వస్తున్నాయి. దీంతో బాబు అలెర్ట్ అయ్యారు?సడన్ గా కుప్పంలో ఎంట్రీ ఇచ్చేశారు. తన హయాంలో మున్సిపాలిటీ చేస్తే ఇబ్బందులు వస్తాయని చేయలేదని, ఇప్పుడు చేశారని, కానీ మున్సిపాలిటీలో వైసీపీని చిత్తు చేయాలని మాట్లాడుతున్నారు.కొందరు పుడంగిలు డబ్బులు సంచులు పట్టుకుని వస్తారని, వైసీపీ వాళ్లు ఓటుకు రూ.5 నుంచి రూ.10 వేల వరకు ఆశ చూపిస్తారని, వారి ప్రలోభాలకు లొంగకుండా, మన కుప్పం పౌరుషం ఏంటో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో చూపించాలని, 25 వార్డుల్లోను మనమే గెలిచి చూపించాలని టీడీపీ శ్రేణులకు బాబు పిలుపునిచ్చారు. 989 నుంచి 2019 వరకు వరుసగా ఏడుసార్లు విజయం సాధించారు. అయితే నెక్స్ట్ ఆ ఛాన్స్ ఇవ్వకూడదని వైసీపీ ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలోనే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం టార్గెట్‌గా రాజకీయ వ్యూహాలు పన్నుతూ అక్కడ టీడీపీని దెబ్బ వీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో చాలావరకు సక్సెస్ అయ్యారనే చెప్పాలి. అనూహ్యంగా బలమైన టీడీపీ క్యాడర్‌ని తమ వైపుకు తిప్పేసుకున్నారు.అలాగా ఊహించని విధంగా పంచాయితీ ఎన్నికల్లో టీడీపీని చిత్తు చేశారు. దాదాపు 90 శాతం పంచాయితీలు వైసీపీ గెలుచుకుని టీడీపీకి షాక్ ఇచ్చింది. అలాగే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో సైతం సత్తా చాటింది?ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రభావం చూపలేకపోయింది. దీంతో కుప్పంలో చంద్రబాబు పని అయిపోయిందని, నెక్స్ట్ ఆయన గెలవడం కష్టమని చర్చలు మొదలయ్యాయి. కొడాలి నాని లాంటి వారైతే కుప్పంలో బాబు గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. అంటే కుప్పంలో పరిస్తితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇక ఆ పరిస్తితులని చక్కదిద్ది, మళ్ళీ టీడీపీని గాడిలో పెట్టడానికే చంద్రబాబు కుప్పంలో ఎంట్రీ ఇచ్చారు. అక్కడ నేతలని, కార్యకర్తలని సమన్వయం చేసి, మళ్ళీ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమం మొదలుపెట్టారు. పైగా త్వరలోనే కుప్పం మున్సిపాలిటీకి ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో పార్టీ గెలవడానికి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా పెద్దిరెడ్డికి చెక్ పెట్టి కుప్పంలో టీడీపీని ఓటమి నుంచి బయటపడేయాలని బాబు చూస్తున్నారు. మరి చూడాలి బాబు ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో.ఇవి కూడా చదవండిఅంటే మామూలు ఎన్నికలకే కుప్పంలో అడుగుపెట్టని బాబు?ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికకు వచ్చి కుప్పంలో ఫీట్లు వేస్తున్నారు. అంటే కుప్పంలో బాబు పరిస్తితి ఎలా ఉందో అర్ధమవుతుంది?25 వార్డుల్లో గెలవడం పక్కనబెడితే?25 వార్డుల్లో సైకిల్‌కు పంక్చర్లు పడకుండా చూసుకుంటే బెటర్

## గవర్నర్ పేరుమీద అప్పులు

విశాఖపట్నం నవంబర్ 1, (న్యూస్ పల్స్) టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చం నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రజలకు తెలుసు..వైసీపీ కి టిడిపి తికెస్ట్ ఫ్రెండా కాదో. అంత ఫ్రెండ్ ఐతే మా మీద కేసులు ఎందుకు పెడతారు.. మా ఆఫీస్ మీదే దాడి చేస్తారా అని ప్రశ్నించారు.గవర్నెర్ పెరు పెట్టి అప్పులు తెస్తున్నారు. మేము ఎప్పుడో చెప్పాము. ఆస్తులు అమ్ముతున్నారని అప్పుడు మాట్లడలేదు.ఇప్పుడు స్పందించారు.. స్టీల్ ప్లాంట్ విషయంలో అఖిల పక్షాన్ని పిలవాలిసిన బాధ్యత సీఎం జగన్ ది.. వాజపేయి హయాంలో స్టీల్ ప్లాంట్ కి ఇబ్బంది వస్తే ఎర్రం నాయుడు నేతృత్వంలో కార్మిక సంఘాలు కేంద్ర పెద్దలను కలిసేలా చేశారు. బి ఎఫ్ ఆర్ నుంచి కాపాడారని అన్నారు. ఈ రోజు సీఎం గా ఉన్న జగన్ కాపాడలిసిన భాధ్యత ఉంది. దురదుష్టవశాత్తు రెండున్నర ఏళ్ల నుంచి రాష్ట్రం పెరు చెబితే అసహించుకుంటున్నారు. ఎక్కడ గంజాయి దొరికిన అది ఆంధ్ర ప్రదేశ్ అంటున్నారు.ఎక్కడ హేరాయిన్ దొరికిన అది ఆంధ్ర ప్రదేశ్ అంటున్నారు. రెండున్నర సంవత్సరాలుగా ప్రశ్నిస్తే జైల్లో వేస్తున్నారు. రాష్ట్ర పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉందని అన్నారు.

## అంతు పట్టని నాని వ్యవహారం

ఏలూరు, నవంబర్ 1, (న్యూస్ పల్స్)ఆయనో డిప్యూటీ సీఎం. రోజూ జనంతో సంబంధం ఉండే శాఖ ఆయనే చూస్తున్నారు. సీఎం రివ్యూలకూ టంచన్‌గా హాజరయ్యే ఆ మంత్రిగారు సొంత నియోజకవర్గ ప్రజలకు మాత్రం కనిపించడం లేదట.ఆళ్ల నాని. ఏలూరు ఎమ్మెల్యేగా గెలిచి ఏపీ డిప్యూటీ సీఎం అయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ అంతా ఆయనే చూస్తున్నారు. కొన్ని రోజులుగా ఆయన నియోజకవర్గ ప్రజలకు కనిపించడం లేదట. మంత్రి కోసం ఆయన ఇంటి దగ్గర, ఆఫీస్ దగ్గర ఎదురు చూస్తున్నవాళ్లకు తీవ్ర నిరాశే మిగులుతోందట. ఒక్కసారి ఇంట్లో ఉండి కూడా జనాన్ని కలవడానికి మంత్రి ఇష్టపడటం లేదట. ఎంత టైమ్ అయినా సరే మంత్రిని కలవాల్సిందే. సమస్యలు చెప్పుకోవాల్సిందే అని ఎవరైనా పట్టుదలతో ఉంటే.. అమరావతి వెళ్లమని చెబుతున్నారట మంత్రి సిబ్బంది. తీరా అక్కడికి వెళ్తే.. మంత్రి ఇక్కడ లేరని సింపుల్‌గా చెప్పేస్తున్నారట. మంత్రి ఇలా ఎందుకు జనాన్ని తప్పించుకు తిరుగుతున్నారు. ఎవరికీ అర్థం కావడం లేదట.ఏలూరులో మంత్రి చుట్టూ ఎప్పుడూ ఓ కోటరీ ఉంటుందట. ఎవరైనా సరే వారిని దాటితేనే మంత్రిగారిని కలవగలరట. వాళ్లను సంతృప్తి పరచడమే ఇప్పుడు ఏలూరు జనానికి సమస్యగా మారిందట. 2004లో మొదటిసారిగా ఏలూరు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు నాని. 2009లో ఓడిపోయారు. వైఎస్ మరణం తర్వాత జగన్‌కు దగ్గరయ్యారు. జగన్ ఓదార్పు యాత్ర కూడా ఏలూరు నుంచే శ్రీకారం చుట్టారు. 2014 ఎన్నికల్లో ఓడిన ఆళ్ల నానిని ఎమ్మెల్సీని చేశారు జగన్. 2019లో గెలుస్తూనే కేబినెట్‌లోకి తీసుకుని ఏకంగా డిప్యూటీ సీఎంను చేసేశారు జగన్. ఇన్నిసార్లు ఓడిన ఆళ్లనాని జనానికి దగ్గరగా ఉండకపోవడానికి కారణం మాత్రం ఎవరూ చెప్పలేకపోతున్నారు.త్వరలో కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందనే ప్రచారం జరుగుతోంది. ఎలాగూ మాజీ అవుతాం కదా అని .. ఇప్పటి నుంచే డిస్టెన్స్ మెయింటైన్ చేస్తున్నారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు కొందరు. పెద్దగా కలుపుగోలు తనం లేని ఆళ్లనాని తీరు ఏలూరు వాసులకు అంతుబట్టడం లేదు. జనంతో కలవమంటే కలవలేకపోయారు. చివరకు పార్టీ పిలుపు ఇచ్చిన జనాగ్రహ దీక్షలోనూ ఆళ్లనాని కనిపించకపోవడంతో మంత్రి వ్యవహారంపై సీరియస్‌గా చర్చ జరుగుతోంది.

## ఎమ్మెల్సీలుగా ఉత్తరాంధ్ర, నేతలు

విజయవాడ, నవంబర్ 1, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల నగారా మోగింది. ఎమ్మెల్యే కోటా కింద ముగ్గురు ఎమ్మెల్సీలను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ముగ్గురు అధికార వైసీ?పీ నుంచి ఎన్నికవుతారు. ఈ ఏడాది మే నెల 31వ తేదీతో బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు, వైసీపీకి చెందిన గోవిందరెడ్డి, టీడీపీకి చెందిన షరీఫ్ పదవీ కాలం పూర్తయింది. ఈ మూడు స్థానాలకు ఎన్నిక జరగనుంది. అయితే జగన్ ముగ్గురిలో ఎవరిని ఎంపిక చేయనున్నారన్న చర్చ జరుగుతోంది.గోవిందరెడ్డిని తిరిగి ఎమ్మెల్సీగా ఎంపిక చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. బద్వేలు ఉప ఎన్నిక పూర్తికావడంతో ఆయనను మరోసారి జగన్ ఎంపిక చేసే అవకాశాలున్నాయి. ఇక సోము వీర్రాజు, షరీఫ్ స్థానాల్లో ఇద్దరిని ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే మైనారిటీ కోటా కింద ఇద్దరికి అవకాశం కల్పించడంతో ఈసారి మైనారిటీలకు అవకాశం లేనట్లే కన్పిస్తుంది. జిల్లాల సమీకరణాలను కూడా జగన్ మార్చనున్నారు.నిజానికి ఆ రెండు స్థానాలు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందినవి. కానీ ఈసారి అదే జిల్లాలతో ఎమ్మెల్సీ పోస్టులను భర్తీ చేసే అవకాశం కన్పించడం లేదు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఇటీవలే ఎమ్మెల్సీలుగా తోట త్రిమూర్తులు, మోషేన్ రాజులను జగన్ ఎంపిక చేశారు. సో.. ఈసారి ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర నుంచి ఎమ్మెల్సీ పదవులను ఇచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. విశాఖ, గుంటూరు జిల్లాల నుంచి భర్తీ చేయనున్నారుగోవిందరెడ్డి పేరు దాదాపు ఖరారయినట్లే. ఆయన సీమ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ఇక గుంటూరు జిల్లా నుంచి మర్రి రాజశేఖర్ కు అవకావశం కల్పిస్తారంటున్నారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన మర్రి రాజశేఖర్ కు జగన్ ఎప్పుడో హామీ ఇచ్చినా ఇంతవరకూ పదవి ఇవ్వలేదు. ఈసారి ఆయనకు గ్యారంటీ అని చెబుతున్నారు. ఇక విశాఖ నుంచి వంశీకృష?ణ శ్రీనివాస్ కు అవకాశముంటుందని చెబుతున్నారు. వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ సామాజికవర్గానికి చెందిన వారు. గతంలో ప్రొద్దుటూరుకు చెందిన రమేష్ యాదవ్ కు ఎమ్మెల్సీ పదవి దక్కింది. అది జగన్ పరిగణనలోకి తీసుకుంటే దాడి వీరభద్రరావుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ముగ్గురు మూడు సామాజికవర్గాలకు చెందిన వారు కావడంతో ఈ ముగ్గురి ఎంపిక ఫైనల్ అయిందన్న ప్రచారం జరుగుతుంది.

## కొత్త స్కీమ్ లపై టీడీపీ స్టడీ

విజయవాడ, నవంబర్ 1, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. ఏ మార్గాన్ని వదిలిపెట్టడం లేదు. అధికారంలోకి వచ్చిన కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల్లో ఏం చేశారన్న దానిపై చంద్రబాబు అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ప్రధానంగా ఢిల్లీ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అక్కడి ప్రాంతీయ పార్టీలు ఇచ్చిన వాగ్దానాలు, హామీలు, అధికారంలో ఉండి వారు అమలు చేసిన సక్సెస్ అయిన స్కీంలపై అధ్యయనం చేయనున్నారు.అన్ని రాష్ట్రాల్లో సక్సెస్ అయిన స్కీమ్ లతో పాటు ప్రజలను ఆకట్టుకునే హామీలను కూడా చంద్రబాబు వచ్చే ఎన్నికల మ్యానిఫేస్టోలో పెట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా తమిళనాడులో డీఎంకే ఏకపక్ష విజయం సాధించింది. పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న స్టాలిన్ పార్టీని సమర్థవంతంగా నడిపి ఎన్నికల్లో దాదాపు 250 హామీలు ఇచ్చారు. వాటిని అధ్యయనం చేయడానికి పార్టీ తరుపున బృందాన్ని చెన్నైకి పంపాలని చంద్రబాబు నిర్ణయించారు.ఇక ఢిల్లీలో కూడా అరవింద్ కేజ్రీవాల్ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయన పథకాలే విజయాన్ని మూడోసారి



దక్కేలా చేశాయి. కేజ్రీవాల్ అమలు చేసిన స్కీంలపై కూడా చంద్రబాబు నివేదిక తెప్పించుకుంటున్నారు. అయితే అక్కడ ఎక్కువవుంది అక్షరాస్యులు ఉండటాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇక పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ కూడా మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆమె స్కీమ్ లకన్నా సెంటిమెంట్ తోనే గెలవడం పై కూడా టీడీపీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది.తెలంగాణలో కేసీఆర్ ఇటీవల ప్రకటించిన దళితబంధు పథకంపై కూడా చంద్రబాబు అధ్యయనం చేయడానికి సిద్ధమయ్యారు. దళిత ఓట్లు ఎక్కువగా జగన్ వైపు ఉండటంతో వారిని ఆకట్టుకోవాలంటే ఈ పథకాన్ని వేరే రూపంలో ప్రవేశపెడితే ఎలా ఉంటుంది? సాధ్యాసాధ్యాలపై చంద్రబాబు స్టడీ చేస్తున్నారు.

# రోడ్డు కోసం రోడ్డెక్కారు

వేములవాడ నవంబర్ 1, (న్యూస్ పల్స్)రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట పట్టణంలో ని శివసాయినగర్ కాలనీ వాసుల నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. శివ సాయినగర్ కాలనీ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 7 ఏళ్ళు గడుస్తున్నా నేటికి పట్టణం నడిబొడ్డున లేని సీసీ రోడ్, డ్రైనేజీ, లేదన్నారు. కాలనీ లో 10 వరకు హాస్పిటల్స్ ఉన్నప్పటికి, రాజన్న గుడికి వెళ్ళే వాహనాలు వెళ్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదన్నారు. గతంలో పలుమార్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీసీ రోడ్, డ్రైనేజి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# కాలువలోపడిన కంటైనర్

విశాఖపట్నంనవంబర్ 1, (న్యూస్ పల్స్)విశాఖపట్నం జిల్లా కూర్మన్నపాలెం రామచంద్ర హోటల్ సమీపంలో ఒక కంటైనర్ లారీ అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు స్వల్పగాయాలు అయ్యాయి. అనకాపల్లి నుండి వైజాగ్ వచ్చే దారిలో ప్రమాదం జరిగింది. దువ్వాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కదం తొక్కిన విద్యార్థులు

విశాఖపట్నం నవంబర్ 1, (న్యూస్ పల్స్)ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ విశాఖ లో విద్యార్థి లోకం రోడ్డు ఎక్కారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ను ప్రైవేటు పరం కానివ్వబోమని గర్జించారు. విశాఖ ఏవిఎన్ కాలేజ్ నుండి పాత పోస్టాఫీసు వరకూ బారీ ప్రదర్శన నిర్వహించారు. పలు విద్యార్థి యూనియన్ లకు చెందిన జాతీయ స్థాయి నాయకులు కూడా ఈ నిరసన లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జాతీయ కార్యదర్శి మయూక్ బిశ్వాయ్, ఎఐఎస్ ఎఫ్ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేషరీ మాట్లాడుతూ ఆనాడు ఉక్కు ఉద్యమంలో పాల్గొని పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ను ప్రైవేటు పరం చేస్తే ఎంప్లాయ్ మెంట్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి పరిస్థితులలో ఉక్కు పరిశ్రమ ను ప్రైవేటు పరం కానివ్వబోమని తెలిపారు. స్టీల్ ప్లాంట్ అంశం ఒక్క విశాఖ పట్నం కే పరిమితం కాదని ఇది దేశ సంపద అని, దీనిని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన వుందని సూచించారు. వేల సంఖ్యలో ఉద్యోగులు వున్నప్పటికి లక్షల మంది పరోక్షంగా స్టీల్ ప్లాంట్ వలన జీవనం సాగిస్తున్నారని వివరించారు. ఈ ర్యాలీ లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో జేడీ

విశాఖపట్నం నవంబర్ 1, (న్యూస్ పల్స్)విశాఖ ఏవిఎన్ ఎయిడెడ్ హై స్కూల్ ను మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ సందర్శించారు. పాఠశాల వసతులు పరిశీలించారు. ఉపాధ్యాయులు ను పాఠశాల కు సంబంధించిన మౌలిక వసతులు పై చర్చించారు. విద్యార్థులు తో ఇంట్రాక్ట్ అయి సమస్యలు ను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇక్కడ పిల్లలు అందరూ తమ పాఠశాల తమ కు వుంచాలని, యధావిధిగా కొనసాగించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ విషయం కోర్టు లో వుందని, ప్రభుత్వం కోర్టు సరైన నిర్ణయం చేసి విద్యార్థులు కు న్యాయం చేస్తారని బావిస్తున్నానన్నారు. ప్రస్తుతం కోవిడ్ వలన ప్రజలు అంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు లో వున్నారని ఫీజులు కట్టలేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ పాఠశాలలు ని విలీనం చేసిన, నాన్ ఎయిడెడ్ గా మార్చినా పేద విద్యార్డుల తల్లి దండ్రులు ఇబ్బందులు పడే పరిస్థితి వుందన్నారు. దీని పై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాల్సిన అవసరం వుందన్నారు.

## గుట్కా స్థావరాలపై మెరుపు దాడులు?

**-గూడూరులో 1500 ప్యాకెట్లు స్వాధీనం?.అమ్మకపు దారులు పై కేసు నమోదు**

**-గుట్కా లు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు**

**గూడూరు పట్టణ సీఐ నాగేశ్వరమ్మ**

గూడూరు నవంబర్ 1, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాలో గుట్కా లపై వస్తున్న వరుస కథనాలకు జిల్లా ఎస్పీ విజయరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా స్టేషన్ల పరిధిలో పోలీసులు నిషేధిత గుట్కా స్థావరాలపై ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వ హించారు.అందులో భాగంగానే గూడూరు డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో పట్టణ సీఐ నాగేశ్వరమ్మ,పట్టణ పోలీసులు గూడూరు పట్టణంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ లో ఉన్న ఓ దుకాణంలో తనిఖీలు చేపట్టగా ఆ దుకాణంలో నిషేధిత హన్స్,గుట్కాలున్నట్లు గుర్తించి సుమారు 1500 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అమ్మకపు దారుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా పట్టణ సీఐ నాగేశ్వరమ్మ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకుగూడూరు పట్టణంలో నిహోల్ సేల్ దుకాణాలు, నిత్యావసర దుకాణాలు, కిళ్లీ షాపులు తదితర అనుమానిత ప్రదేశాల్లో దాడులు చేసి 1500 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.గుట్కా లు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు.

# కుటుంబ కలహాలతో లెక్చరర్ ఆత్మహత్య

కడప నవంబర్ 1, (న్యూస్ పల్స్)కుటుంబ కలహాలతో ఒక లెక్చరర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని పక్కీర్ వీధిలో కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో టి. గణేష్ (35) ఎవరూ లేని సమయంలో వాజ్మోల్ తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని ఆలస్యంగా గమనించిన బంధువులు హుటాహుటిన కడప రిమ్స్ కు తరలించారు. రిమ్స్ లో చికిత్స పొందుతూ సోమవారం ఈరోజు తెల్లవారుజామున 5 గంటలకు మృతి చెందాడు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు అంటున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు వున్నారు. కమలాపురం ఓప్రైవేటు కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ గా పనిచేస్తున్నారు..

# బద్వేల్ ఉప ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

**రాజంపేట సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్**

బద్వేల్ నవంబర్1 బద్వేల్ అసెంబ్లీ కాన్స్టెన్సీ కి సంబంధించి కౌంటింగ్ ఏర్పాట్లన్నీ పూర్తి చేయడం జరుగుతోంది బద్వేల్ నందని గురుకుల ప్రభుత్వ బాలికల పాఠశాలలో నియోజకవర్గానికి సంబంధించి 281 పోలింగ్ కేంద్రాలలో అక్టోబర్ 30న జరిగిన పోలింగ్ కు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గురుకుల పాఠశాలలో 4 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన ప్రత్యేక మార్గదర్శకాలను అనుసరించి ఒక్కొక కౌంటింగ్ కేంద్రంలో 7 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో ఆర్ఓ, ఏఆర్ఓలకు ఒక టేబుల్, ఏడు కౌంటింగ్ టేబుల్స్ ఉంటాయన్నారు. ఆర్ఓ ఉన్న కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారని పేర్కొన్నారు. ర్యాండం చెకింగ్ కోసం ఒక వివి ప్యాట్ కేంద్రం ఏర్పాటు చేశాం. కౌంటింగ్ హాల్ కు సంబంధించిన అన్ని అరేంజ్మెంట్స్ పూర్తి చేశాం. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో ఒక కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. అబ్జర్వర్ సమక్షంలో ర్యాండమైజేషన్ చేస్తాము. కౌంటింగ్ కేంద్రంలో భద్రత కొరకు బారికేడింగ్ తోపాటు మెస్ ఏర్పాటు చేశాం. అధికారులు, ఏజెంట్లు రావడానికి విడివిడిగా ఎంట్రన్స్, కూర్చోడానికి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. కౌంటింగ్ కు సంబంధించి ఏడు రోజుల ముందుగా రాజకీయ పార్టీలకు, అభ్యర్థులు ఏజెంట్లకు నోటీసులు పంపడం జరిగింది. రేపు ఉదయం 2న ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. అభ్యర్థుల సమక్షంలో రేపు ఉదయం స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేస్తాం. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్ వారి ఓట్లను లెక్కించడం జరుగుతుంది. గరిష్టంగా 12 రౌండ్లలో ఓట్లను లెక్కించడం పూర్తవుతుందని అంచనా వేయడం జరిగింది. రౌండ్ వారి ఫలితాలను మీడియా వారికి అందజేయడానికి ప్రత్యేకంగా మీడియా పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సర్వీస్ వోటర్లు, 80 సంవత్సరాల పైబడిన మరియు దివ్యాంగుల ఓట్లు మొత్తం 235 పోస్టల్ బ్యాలెట్ వచ్చాయని, రేపు ఓట్లు లెక్క పెట్టే సమయానికి ఏమైనా సర్వీస్ ఓటర్స్ ఓట్లు అందితే వాటిని కూడా కలిపి లెక్క పెట్టడం జరుగుతుందన్నారు. మొత్తం 68.37 శాతం ఓట్లు పోలైన ఓట్లు విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానం తెలిపారు. వర్షాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ ఏర్పాట్లన్నీ పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

# 74 ఎకరాల వక్ఫ్ భూములను మింగేస్తున్నారు

నంద్యాల నవంబర్ 1, (న్యూస్ పల్స్)నంద్యాల జిల్లా కాబోతున్నదని ఊహాగానాలు వినిపించడముతో. నంద్యాల పట్టణంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రైవేటు భూములు ఒక ఎకర 5 కోట్లు పలుకు తుంటడముతో ఇంటి స్థలాలకు భారీగా డిమాండ్ పెరగడంతో. భూ కబ్జా దారులు . అక్రమ సంపాదన అలవాటు పడ్డ వారు . ఏట్లా అయినా అవినీతి సొమ్ము సంపాదించాలనే ఆలోచనల తో . వక్ఫ్ భూములను ఆక్రమించు కోవాలనే దురుద్దేశం తో. కొందరిని ముస్లిం సోదరులను. రెవెన్యూ అధికారులను. చోట మోట నాయకులను కలుపుకొని పన్నాగం పడినట్లు తెలుస్తోంది . నూనెపల్లె లో గల వక్ఫ్ భూములపై వీరి దృష్టి పడింది . సర్వే నెంబరు 22.47.52. 228.231. 236.239. 275.278.284. సర్వే నెంబర్ ల లో 74 ఎకరాల వక్ఫ్ భూములను రాత్రి కి రాత్రె వక్ఫ్ భూముల రూపు రేఖలు మారి పోయాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారని. ఎవరి వాటాలు వారు తీసుకున్నారని పలువురు విమర్శలు వినిపిస్తున్నాయి . ముస్లిం సోదరులు మాట్లాడుతూ ఇంత అన్యాయం ఎక్కడ జరిగలేదని వాపోయారు . ముస్లిం మైనార్టీ వారి బాగోగులకు గాను గతంలో ప్రభుత్వాలు వక్ఫ్ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇతరుల కు ఇవ్వద్దు అని ఎన్నో జీవోలు జారీ చేశారని అన్నారు . ఆ భూములు ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం వారి కే చెందుతాయని పదె పదే ప్రకటనల చేస్తూనే వుందన్నారు . గతంలో కొంత మంది ముస్లిం మైనార్టీ వారు వక్ఫ్ భూములను ఇతరులు కొనుగోలు చేస్తున్నారని. మరియు భూ కబ్జాదారులు ఆక్రమించుకొను చున్నారని ధర్నాలు నిరహర దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు ఈ విషయం పై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారని . కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలం లో జెండాలు పాతి ఈ భూములు వక్ఫ్ బోర్డు కు సంబంధించినవి అని ఎటువంటి లావాదేవీలు నడప కూడదని ఎటువంటి నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేచిన కూడా. కొందరు వక్ఫ్ బోర్డు అధికారులు ప్రమేయం తో . రాజకీయ నాయకుల ప్రమేయం తో . అవినీతి రెవెన్యూ అధికారుల తో కలసి పన్నిన కుట్రలో భాగంగానే వక్ఫ్ భూములపై వెంచర్లు వేయడం, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . ముస్లిం మైనార్టీ పెద్దల హస్తం తో నే ఈ వ్యవహారం నడుస్తోంది అని కొంతమంది ముస్లిం ఆరోపణలు చేస్తున్నారు . ఏది ఏమైనా వక్ఫ్ భూములను కాపాడాలని పలువురు ముస్లిం మైనార్టీ సోదరులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే భూ కబ్జా దారులను అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు .

# కడపకు మరోసారి వరద ముప్పు తప్పదా..!

**- రెండేళ్లు కావస్తున్నా వరద పరిహారం ఇవ్వకాపాయే రక్షణ గోడ కట్టకపాయే.!**

**అధికారుల నిర్లక్ష్యంతోనే రక్షణ గోడ పూర్తి కాలేదు**

**ఆక్రమణ దారులను కాపాడేందుకే అధికారులు ఉన్నారా.?**

**- సీపీఐ జిల్లా కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, నగర కార్యదర్శి యన్. వెంకట శివ..**

కడప నవంబర్01 కడపలో చిన్నపాటి తుపాను వస్తే చాలు బుగ్గవంక జలాశయం నిండిపోతున్న పరిస్థితుల్లో బుగ్గవంక రక్షణ గోడ లేకపోవడంతో మూడోసారి వరదలు ముంచెత్తవచ్చని బుగ్గవంక పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో బుగ్గవంక రక్షణ గోడ కొన్ని చోట్ల అసంపూర్తిగా, మరికొన్ని చోట్ల పనులే ప్రారంభం కాకపోవడంతో పరివాహక ప్రాంత ప్రజలు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లాలా? వద్దా? అనే సందేహంలో జీవిస్తున్నారు.సరిగ్గా 2001, అక్టోబరు 16 వ తేది.. బుగ్గవంక వరద నీరు కడప నగరంపై తొలిసారి జలఖడ్గాన్ని ఝుళిపించిన రోజు. ఆ వరదల్లో సుమారు పదుల సంఖ్యలో మృతి చెందగా, వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. నాటి జల విలయంలో కొందరు గల్లంతయ్యారు. ఆ వరద గాయం మానకముందే 2020 నవంబరు 26న మరోసారి బుగ్గవంక కడప నగరంపైకి దూసుకొచ్చింది.చూస్తూ ఉండగానే ముంచేసింది..మొదటి ఘటనకు రెండో ఉత్పాతానికి మధ్య 19 ఏళ్ల అంతరం ఉన్నా ఆ గాయాలు మాత్రం మానలేదు..అధికారులు మారలేదు..ఈ కాలంలో అధికార, పాలక యంత్రాంగం బుగ్గవంక అభివృద్ధి పనులు పూర్తి చేసి ఉంటే రెండో సారి ఆ వంక కడప నగరంపై విరుచుకుపడేది కాదని పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు.రెండోసారి ఉపద్రవం సంభవించి ఇప్పటికి ఏడాది పైగా గడిచిపోయింది.మళ్ళీ వర్షాకాలం వచ్చింది. మళ్ళీ పై నుంచి వరద నీరు బుగ్గవంక జలాశయం కి చేరితే మళ్ళీ మా పరిస్థితి ఏంటని నగర వాసులు ఆవేదన చెందుతున్నారు బుగ్గవంక జలాశయం కి వరద నీరు వచ్చి చేరితే మళ్ళీ మూడోసారి కడప వాసులను వరదనీరు ముంచేస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదం,భయం ప్రతిసారి రావడానికి ప్రధాన కారణం బుగ్గవంక నీరు సరైన క్రమంలో వెళ్లేందుకు ఇరు వైపులా రక్షణ గోడ కొన్ని చోట్ల లేకపోవడమే కారణం బుగ్గవంక నీరు కడప నగరంలో నుంచి కిందికి వెళ్లే క్రమంలో రక్షణ గోడ నిర్మాణం కొన్ని ఏరియాల్లో లేకపోవడంతో పాటు కొన్ని చోట్ల రక్షణ గోడకి గ్యాప్ లు ఉండడంతో చుట్టూ పక్కల ఉన్న కాలనీలు పూర్తి స్థాయిలో మునిగిపోయి మొత్తం కోల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇప్పటికి రెండు సార్లు దెబ్బ తిన్న తర్వాత అధికార యంత్రాంగం సీఎం జగన్మోహన్ రెడ్డి దృష్టి కి తీసుకొని పోవడంతో నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

# మానవత్వాన్నిచాటుకున్న సీఎం స్టాలిన్



**కాన్వాయ్‌ను ఆపేసి.. అంబులెన్స్ కు దారి**

చెన్నై నవంబర్ 1 తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మానవత్వాన్ని ప్రదర్శించారు. కాన్వాయ్‌ను ఆపేసి.. అంబులెన్స్‌కు సీఎం స్టాలిన్ దారిచ్చారు.కోయంబత్తూరు–వెలచెరి రూట్లో సీఎం కాన్వయ్ వెళ్తున్న సమయంలో.. వెనుక నుంచి ఓ అంబులెన్స్ వచ్చింది. అయితే వేగంగా వెళ్తున్న ఆ అంబులెన్స్ కోసం సీఎం స్టాలిన్ వాహనశ్రేణి దారిని ఇచ్చింది. ఎడమ వైపు కాన్వాయ్‌ను ఆపి .. అంబులెన్స్‌కు మార్గాన్ని కల్పించారు. మార్ మధ్యంలో కాన్వాయ్‌ను నిలిపివేసి.. అంబులెన్స్‌కు దారి ఇచ్చిన సీఎం స్టాలిన్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. అనేక మంది ఈ ఘటనకు సంబంధించిన వీడియోను షేర్ చేస్తున్నారు. ఇటీవల సీఎం స్టాలిన్ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశించారు. ఎవరూ కాన్వాయ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవద్దు అన్నారు. స్టాలిన్ వాహనశ్రేణిలో రెండు పైలెట్ వాహనాలు, మూడు ఎస్కార్ట్ వాహనాలతో పాటు ఓ జామర్ వాహనం ఉంటుంది. స్టాలిన్‌కు ప్రస్తుతం జెడ్ ప్లస్ భద్రతను కల్పిస్తున్నారు. సీఎం కాన్వాయ్‌లోని అడ్వాన్స్ పైలెట్ వాహనం వెళ్లిన తర్వాత అయిదు నిమిషాల ముందు మాత్రమే ట్రాఫిక్‌ను ఆపనున్నారు. ఇవాళ ఉదయం సీఎం స్టాలిన్ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. చెన్నైలో ఇవాళ్టి నుంచి స్కూళ్లు ఓపెన్ చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు బడులు తెరిచారు. ఈ నేపథ్యంలో సీఎం స్టాలిన్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

# 29వ డివిజన్ వైకాపా అభ్యర్థి డాక్టర్ షేక్ సత్తార్ విజయానికి కృషి చేస్తాం

**పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు వినుకోటి మధుబాబు**

నెల్లూరు నవంబర్ 1, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజవర్గ లోని 29వ డివిజన్ వైకాపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ షేక్ సత్తార్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు వినుకోటి మధుబాబు పేర్కొన్నారు. స్థానిక 29వ డివిజన్ లోని మధుబాబు నివాసంలో నేను నా కార్యకర్త కార్యక్రమంలో భాగంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం 29వ డివిజన్, గాంధీ నగర్, వీవర్స్ కాలనీలో నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు వినుకోటి మధు బాబు వారి నివాసంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరినవాళ్ళు, మొదటి నుండి పార్టీకోసం కష్టం చేసిన వారు అందరూ కలిసికట్టుగా గ్రామీణ నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతీ గడపకూ చేరేలా పని చేయాలని సూచించారు. ఎంతో మంచి మనసుతో ముందుకు వచ్చి, 29వ డివిజన్ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ షేక్ సత్తార్ గెలుపుకోసం పనిచేస్తానన్న నెల్లూరు జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు వినుకోటి మధు బాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు



తిరుపతి, నవంబర్ 1, (న్యూస్ పల్స్)ఎలక్ట్రిక్ బస్సులను నడపడానికి ఏపీఎస్ఆర్టీసీ రంగం సిద్ధం చేస్తోంది. పర్యావరణ కాలుష్యం తగ్గించి తద్వారా ప్రజలకు మేలైన రవాణా సౌకర్యం కల్పించడానికి బస్సులను ఏర్పాటు చేస్తోంది. 100 విద్యుత్ బస్సులను ప్రవేశ పెట్టడానికి ఆర్టీసీ రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, తిరుపతి లలో 350 విద్యుత్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (ఉఅఅ) అద్దె ప్రాతిపదికన బస్సులను త్రిప్పడానికి ఏపీఎస్ ఆర్టీసీ టెండర్లను సైతం పిలిచింది.టెండర్ల ప్రక్రియ లో మొత్తం ముగ్గురు పాల్గొన్నారు. మెస్సర్స్ ఈవే ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మేఘా ఇంజనీరింగ్ ఢన్ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్ హైద్రాబాదు మరియు మెస్సర్స్ అశోక్ లేలాండ్, చెన్నై సంస్థలు పాల్గొన్నాయి. కాగా మెస్సర్స్ ఈవే ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంద్ర డీజిల్ బస్సు రేటుతో ఎలక్ట్రిక్ బస్సులు త్రిప్పుటకు ఒప్పుకుంది. మెస్సర్స్ ఈవే ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తిరుపతి నుండి నిర్దేశించిన మార్గాలలో బస్సులను నడుపనుంది. అంతే కాకుండా ఈ ఎలక్ట్రిక్ బస్సులను సీఎం త్వరలోనే ప్రారంభించనున్నారు.

# భారీ వర్షానికి నర్సాపురం రోడ్డు జలమయం

ఏలూరు నవంబర్ 1, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఈరోజు ఒక గంట పాటు ఉరుములతో కూడిన వర్షం తో నర్సాపురం పట్టణ ప్రాంతం రోడ్లన్నీ వర్షం నీటితో జలమయమయ్యాయి పట్టణంలోని మెయిన్ రోడ్డు,స్టీమర్ రోడ్ పూర్తిగా నీటమునిగాయి, ఈ వర్షం నీటి మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు, వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి అధికారులు ఈ పరిస్థితి నామమాత్రంగానైనా పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

# నిబంధనలు పాటించండి

కొవ్వూరు నవంబర్ 1, (న్యూస్ పల్స్)దీపావళి షాపు లైసెన్స్ పొంది షాపు లు నిర్వహించే వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు సోమవారం ఒక ప్రకటన లో హెచ్చరించారు. నవంబర్ 4వ తేదీన జరుపుకునే దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు మేరకు నవంబర్ 2, 3 , 4 తేదిలలో మూడు రోజుల పాటు దీపావళి సామగ్రి, టపాసులు అమ్ముకునేందుకు అనుమతులు మంజూరు చెయ్యడం జరిగిందన్నారు. ప్రమాదకరమైన టపాసులు విక్రయాలు జరపరాదని విజ్ఞప్తి చేశారు. ఈ దీపావళి మీ ఇంట ఆనందాన్ని చేకూరాలని, ఎటువంటి ప్రమాదకర టపాసులు కాల్చరాదన్నారు. పర్యావరణానికి హానికరం కానటు వంటి వాటినే కాల్చాలని తెలిపారు. దీపావళి సామగ్రి అమ్మే షాపుకి షాపుకి మధ్య కనీసం 10 మీటర్లు దూరం ఉండేలా చూడాలని, అగ్నిప్రమాదం నివారించే ఎక్సటింగ్ షర్స్, 200 లీటర్లు నీటితో కూడిన రెండు డ్రమ్ములు, రెండు ఇసుక , రెండు నీటితో కూడిన బకెట్ లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా షాపుల్లో ఉంచాలన్నారు. ఆయా ప్రాంతాలను నో స్మోకింగ్ జోన్ లుగా పరిగణించుట జరిగిందని ఆర్డీవో తెలిపారు.

కోవిడ్ మార్గదర్శకాలు పాటించండి..

అమ్మకాలు, కొనుగోళ్లు సమయంలో ఖచ్చితంగా భౌతిక దూరం పాటిస్తూ కనీసం వ్యక్తి కి వ్యక్తి కి మధ్య ఆరడుగుల దూరం, మాస్కు ధరించడం తప్పనిసరి అన్నారు. షాపుల్లో పనిచేయుటకు , అమ్మకాలు జరుపుటకు 18 సంవత్సరాలు లోపు పిల్లలకు అనుమతి లేదని, ఉల్లంఘన కి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని మల్లిబాబు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ ద్వారా అనుమతి పొందిన వారే షాపులు నిర్వహించాలన్నారు. షాపు లు ఉన్న గ్రౌండ్ లోకి రావడానికి, పోవడానికి విడివిడిగా మార్గాలు ఉండాలని, షాపులకు దూరంగా వాహనాలు కోసం సరిపడే పార్కింగ్ స్థలం ఉండాలన్నారు. దీపావళి వ్యాపారం కోసం అనుమతి తీసుకున్న వ్యక్తులు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల వద్ద వారి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

# ఆర్డీవో కార్యాలయంలో అమరజీవి కి " ఘన నివాళి"

కొవ్వూరు నవంబర్ 1, (న్యూస్ పల్స్)అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో నవ్యాంధ్ర ప్రదేశ్ సర్వతో ముఖాభివృద్ధి కోసం కలిసి కట్టుగా పనిచేద్దామని ఆర్డీవో ఎస్. మల్లిబాబు పిలుపునిచ్చారు.స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ, దేశంలోనే తొలి భాషా ప్రవుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడేవాళ్ళు ఎక్కువగా ఉండేవారని, ఆరోజుల్లో ఆంధ్రుల ని మదరాసి లుగా పిలవబడే వారన్నారు. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం మద్రాసు లో 58 రోజులు అమర నిరాహారదీక్ష చేసి అసువులు బాసారు. గత్యంతరం లేక పరిస్థితిలో ఫజిల్ అలీ కమిషన్ అప్పటి ప్రభుత్వం వేసి, కర్నూల్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్నీ ఏర్పాటు చేశారు. మహోన్నత వ్యక్తిత్వం గల పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు చేసిన ప్రాణత్యాగం ...రాష్ట్రాభివృద్ధి కోసం నేడు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు కు నివాళులు అర్పించిన వారిలో హౌసింగ్ ఈఈ హరిబాబు, పరిపాలనాధికారి జవహర్ బాజీ, డివిజనల్ పిఆర్వో ఎమ్. లక్ష్మణాచార్యులు, తాహాసీల్దార్ బి. నాగరాజు నాయక్, డీఎల్ డిఓ పి. జగదాంబ, ఇతర శాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు ఉన్నారు.

# జడ్పీ హై స్కూల్లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

డోన్ నవంబర్ 1,( విభారె) డోన్ పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలోఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ప్రధాన ఉపాధ్యారాలు పద్మావతీ అధ్యక్షతనఘనంగా నిర్వహించారు,స్థానిక పట్టణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సోమవారం ఉదయం ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు, ముందు గా అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించినట్లు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు,ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు గారి ఆమరణ దీక్ష తోనే మనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు అయిందని అన్నారు, పొట్టి శ్రీరాములు చెన్నై లో జన్మించి, ఉన్నత చదువులు చదివి, ఉద్యోగం చేస్తూనే, రాజీనామా చేసి, గాంధీజీ బాటలో అహింసా మార్గంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు,సబర్మతి ఆశ్రమం లో చేరి గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేయడం జరిగింది, స్వాతంత్రం ప్రకటించిన తర్వాత తెలుగు వారి కోసం మద్రాసు రాష్ట్రం నుండి భాషా ప్రాతిపదికన రాష్ట్రం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అమరజీవి అయ్యాడు.ఆ తరువాత అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1953 అక్టోబర్ 1 న కర్నూలు కేంద్రం గా ఆంధ్ర రాష్ట్రం అవతరించగా, హైదరాబాద్ విలీనం కాగా 1956 నవంబర్ 1 న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ను ఏర్పాటు చేసారు, అదేవిధంగా విద్యార్థులు తీసుకో వలసిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు తెలిపారు.ముఖ్యంగా మాస్క్ ధరించడం,శానిటైజర్ వాడడం, వాటర్ బాటిల్ తీసుకుని రావడం, ఇతరుల వస్తువులను (పెన్ను, పుస్తకాలు) తాకకుండా ఉండడం, కేటాయించిన సీట్లలో కూర్చోవడం,6అడుగుల దూరం పాటించడం లాంటి జాగ్రత్తలు, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంలో పలుసూచనలు యిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకట రమణ, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాసులు, సుబ్బారాయుడు,లక్ష్మి కాంత రెడ్డి, వెంకట లక్ష్మి,రాధ,మధు సూధన్ రెడ్డి, లీలావతమ్మ, సురేష్, సుభాన్, అల్లిపీరా, రమేష్,జయ సుబ్బారాయుడు, భాను ప్రకాష్ రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మి ప్రభావతి, ఆదినారాయణ, మునిరాజు,ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నవంబరు 4న టిటిడి స్థానిక ఆలయాల్లో దీపావళి ఆస్థానం

తిరుపతి ,నవంబర్ 01, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీ కోదండరామస్వామివారి ఆలయాల్లో నవంబరు 4వ తేదీ దీపావళి సందర్భంగా శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించనున్నారు.శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో....

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ పుండరికవల్లి అమ్మవారి ఆలయం నుండి సాయంత్రం 5.30 నుండి 6.30 గంటల మధ్య నూతన వస్త్రాలు, దీపాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు.

శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో....

శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో దీపావళి సందర్భంగా రాత్రి 7.00 నుండి 8.00 గంటల వరకు దీపావళి ఆస్థానం నిర్వహించారు. దీపావళి సందర్భంగా గురువారం రాత్రి 7.00 గంటలకు తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం నుండి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలు తీసుకువచ్చి శ్రీకోదండరామస్వామివారికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించే సహస్ర కలశాభిషేకంసేవ, హనుమంత వాహనసేవను టిటిడి రద్దు చేసింది.

నవంబరు 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం :

శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో నవంబరు 2న ఉదయం 7 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. అనంతరం భక్తులను ఉదయం 9.30 గంటల నుండి దర్శనానికి అనుమతిస్తారు.

శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నవంబరు 2న ఉదయం 7.30 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. అనంతరం భక్తులను ఉదయం 11 గంటల నుండి దర్శనానికి అనుమతిస్తారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.

## టీటీడీ విజిలెన్స్ విభాగం సైకిల్ ర్యాలీ

తిరుపతి,మా ప్రతినిధి, నవంబర్ 01,విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం టీటీడీ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అలిపిరి పాత చెక్ పోస్ట్ వద్ద సివిఎస్వో గోపీనాథ్ జెట్టి, ఎస్వీబీసీ సిఈవో సురేష్ కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అలిపిరి కొత్త చెక్ పోస్ట్ వరకు ర్యాలీ సాగింది. అదనపు సీవోఎస్వో శివకుమార్ రెడ్డి, విజివో లు మనోహర్, బాలిరెడ్డి తో పాటు ఏవీఎస్వోలు, విజిలెన్స్ ఇన్స్ పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిద్ర పట్టడం లేదా; అయితే ఈ ఆహారాలను రాత్రిపూట ఎప్పుడూ తినవద్దు



ప్రపంచవ్యాప్తంగా 70 మిలియన్ల మంది నిద్రలేమితో బాధపడుతున్నారని మీకు తెలుసా? నిద్ర పట్టకపోవడం, నిద్రలో తరచుగా మేల్కొనడం, తగినంత నిద్ర రాకపోవడం, అలసటగా అనిపించడం ఇలా ప్రతి ఒక్కరూ అనేక విధాలుగా నిద్ర సమస్యలతో బాధపడుతున్నారు. నిజానికి, ఆరోగ్య నిపుణులు మీ రోజువారీ దినచర్య మరియు మంచి నిద్ర కోసం అలవాట్లపై శ్రద్ధ వహించాలని సలహా ఇస్తున్నారు. దానికి ఒక మార్గం ఆహారం ద్వారా. ఆహారం శరీరానికి శక్తి వనరు. అయితే రాత్రిపూట కొన్ని ఆహారాలు తినేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే కొన్ని ఆహారాలు మీ మంచి నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. ఆహారం మొత్తం కూడా ముఖ్యం. పడుకునే ముందు పెద్ద మొత్తంలో ఆహారం తీసుకోవడం చెడ్డది. పెద్ద మొత్తంలో డిన్నర్ గ్యాస్ట్రో ఎసోఫాగియల్ రిఫ్లక్స్‌ను పెంచుతుంది. ఇది గుండెల్లో మంట మరియు వికారం కలిగిస్తుంది మరియు మీకు మంచి నిద్రను దోచుకుంటుంది. కాబట్టి కడుపు నిండినంత వరకు రాత్రిపూట తినకపోవడమే మంచిది. మీకు అవసరమైనది మాత్రమే తినండి. ఈ వ్యాసంలో మీరు పడుకునే ముందు ఎన్నడూ తినకూడని కొన్ని ఆహారాల గురించి చదువుకోవచ్చు. అందరికీ నిద్ర ఎంత అవసరం అందరికీ నిద్ర ఎంత అవసరం నేషనల్ స్లీప్ ఫౌండేషన్ ప్రకారం, ప్రతి ఒక్కరూ వారి వయస్సును బట్టి నిద్ర అవసరం. నవజాత శిశువులు: 14-17 గంటలు పిల్లలు: 12-15 గంటలు పసిబిడ్డలు: 11-14 గంటలు పాఠశాల వయస్సు పిల్లలు: 9-11 గంటలు కౌమారదశలో ఉన్నవారు: 8-10 గంటలు యువకులు: 7-9 గంటలు పెద్దలు: 7-8 గంటలు జుట్టు బలంగా పెరగడానికి ఈ పోషకాలు అవసరంజుట్టు బలంగా పెరగడానికి ఈ పోషకాలు అవసరం ఆహారం మరియు నిద్ర ఆహారం మరియు నిద్ర సరైన రకమైన ఆహారం నిద్రను ప్రేరేపిస్తుంది. వారు అనేక విధాలుగా పని చేస్తారు. నిద్ర నాణ్యతను ప్రభావితం చేసే సమ్మేళనాల సంశ్లేషణకు మీ శరీరం యొక్క జీవ ప్రక్రియలను నియంత్రించడంలో ఆహారాలు సహాయపడతాయి. అలాగే తప్పుడు ఆహారాలు మీ నిద్రను నిరోధిస్తాయి. అవి శరీరం విశ్రాంతి తీసుకోకుండా నిరోధిస్తాయి మరియు నిద్రపోవడం కష్టతరం చేస్తాయి. లేదా అవి మీ శరీరాన్ని ఉత్తేజపరుస్తాయి మరియు మీరు అలసిపోయినప్పటికీ మరియు నిద్రపోవాలనుకున్నా కూడా మిమ్మల్ని మేల్కొల్పుతాయి. డయాబెటిస్‌ను ఒక వారంలో నయం చేయవచ్చా? అయితే మీరు తాగాల్సిన జ్యూస్ ఇదే..డయాబెటిస్‌ను ఒక వారంలో నయం చేయవచ్చా? అయితే మీరు తాగాల్సిన జ్యూస్ ఇదే.. క్రూసిఫరస్ కూరగాయలు క్రూసిఫరస్ కూరగాయలు బ్రోకలీ, కాలీఫ్లవర్ మరియు క్యాబేజీ వంటి క్రూసిఫరస్ కూరగాయలు సాధారణంగా ఆరోగ్యానికి చాలా మంచివి, కానీ మీరు పడుకునే ముందు తినడానికి అంత మంచిది కాదు. ఈ కూరగాయలు మంచి నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. మీరు నిద్రించడానికి ప్రయత్నించినప్పుడు అందులోని ఫైబర్ గ్రహించబడుతుంది. రాత్రి సమయంలో మీ శరీరం వాటిని జీర్ణించుకోలేకపోవచ్చు. ఇది జీర్ణ సమస్యలకు కూడా దారితీస్తుంది. అందువల్ల, అలాంటి ఆహారాన్ని పగటిపూట మాత్రమే తినండి. దీర్ఘకాలిక కోవిడ్ -19 సంక్రమణ మీకు రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుందా? ఇది ప్రాణానికి ప్రమాదకరమా?దీర్ఘకాలిక కోవిడ్ -19 సంక్రమణ మీకు రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుందా? ఇది ప్రాణానికి ప్రమాదకరమా? ఐస్ క్రీమ్ మరియు అధిక చక్కెర ఆహారం ఐస్ క్రీమ్ మరియు అధిక చక్కెర ఆహారం భోజనం తర్వాత మరియు పడుకునే ముందు ఒక గిన్నె ఐస్ క్రీం తీసుకోవడం మంచిది అనిపించినప్పటికీ, అది మీ నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. ఐస్ క్రీం జీర్ణం కావడానికి సమయం పడుతుంది మరియు ఆహారాన్ని జీర్ణం చేసేటప్పుడు మీ శరీరం సరిగ్గా విశ్రాంతి తీసుకోదు. అదేవిధంగా, అధిక చక్కెర మీ శక్తిని పెంచుతుంది మరియు మీ నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. మీకు మంచి నిద్ర కావాలంటే రాత్రిపూట క్యాండీలు మరియు ఐస్ క్రీములకు దూరంగా ఉండటం మంచిది. సిట్రిక్ పండ్లు మరియు టమోటాలు సిట్రిక్ పండ్లు మరియు టమోటాలు టమోటాలు తినడం మీ నిద్రను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఇది ప్రధానంగా అమైనో ఆమ్లం టైరామైన్ కారణంగా, ఇది మీ మెదడు యొక్క కార్యాచరణను పెంచుతుంది మరియు నిద్రను ఆలస్యం చేస్తుంది. సిట్రస్ పండ్లు ఎప్పుడూ అనారోగ్యకరమైనవి కావు. అయితే, ఇందులో విటమిన్ సి అధికంగా ఉన్నందున రాత్రిపూట తీసుకోవడం మంచిది కాదు. ఎందుకంటే ఇది సరిగా శోషించబడదు మరియు అసిడిటీ మరియు గుండెల్లో మంటకు కారణం కావచ్చు. ఇది మీ నిద్ర చక్రాన్ని భంగపరచడమే కాకుండా మరుసటి రోజు నాశనం చేస్తుంది. మద్యం మద్యం చాలా మంది రాత్రిపూట తాగడానికి ఎంచుకుంటారు. కానీ, అది మీ నిద్రకు ఆటంకం కలిగించే అలవాటు. పడుకునే ముందు మద్యం తాగడం వల్ల మీ నిద్ర నాణ్యతను ప్రభావితం చేయవచ్చు.

# గుడి కంబలి గ్రామంలో భారీగా వైసీపీలోకి వలసలు

కౌతాళం నవంబర్ 1,( విభారె) ప్రభుత్వ పథకాలు మెచ్చి వైసీపీ పార్టీలోకి చేరుతున్న మని గుడి కంబలి గ్రామంలో ముస్లిం 60 కుటుంబ లు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పార్టీలోకి చేరారు వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసే నవరత్నాలు ప్రజా సమస్యలపై నిరంతరం కృషి అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడికంబలి గ్రామస్తులు పాల్గొన్నారు.

# రానా కొత్త అవతారం.. ఇదేంటి భయ్యా!



టాలీవుడ్ యంగ్ హీరో రానా వరుస సినిమాలు చేయడంతో పాటు పలు కంపెనీలతో కొలబ్రేట్ అవుతూ ప్రమోటర్ గా వ్యవహరిస్తూ ఉంటాడు. రానా ఎప్పుడు కూడా ఏదో ఒక జాతీయ లేదా అంతర్జాతీయ సంస్థ లేదా ప్రాజెక్ట్ తో సంబంధాలు పెట్టుకుంటూనే ఉంటాడు. హాలీవుడ్ మూవీకి అప్పట్లో డబ్బింగ్ చెప్పడంతో పాటు ఆ సినిమాను ఇండియాలో ప్రమోట్ చేయడం జరిగింది. ఆ తర్వాత కూడా చాలా చాలా ప్రాజెక్ట్ లు ఆయన చేస్తూనే ఉన్నాడు. ఒక వైపు హీరోగా నటిస్తూ మరో వైపు ఇలాంటి అదనపు ప్రమోషన్స్ చేయడంలో రానా ఎప్పుడు కూడా వెనక ఉండడు అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. రానా కొత్తగా సోనీ లీవ్ ఓటీటీ ని ప్రమోట్ చేసేందుకు ముందుకు వచ్చాడు.ఇప్పటికే ఉత్తరాదిన మంచి ఆధరణ దక్కించుకున్న సోనీ లీవ్ ఓటీటీని సౌత్ లో విస్తరించేందుకు గాను పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రముఖ స్టార్స్ సినిమాలతో పాటు వెబ్ సిరీస్ లను కూడా సోనీ వారు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం రానా ను ప్రమోటర్ గా వారు ఎంపిక చేసుకున్నారు. రానా సోనీ లీవ్ ప్రమోషన్ కోసం కమర్షియల్ యాడ్ లో నటించాడు. అందులో డబ్ల్యూ డబ్ల్యూ ఈ ఆర్టిస్టుగా రానా కనిపించబోతున్నాడు. ఇప్పటి వరకు ఏ సౌత్ హీరో కూడా ఇలాంటి ప్రయోగాన్ని చేయలేదు. మొదటి సారి రానా నుండి ఇలాంటి ప్రయోగం రాబోతున్న నేపథ్యంలో అంతా కూడా ఆశ్చర్యంగా ఆసక్తిగా చూస్తున్నారు. పెద్ద ఎత్తున అంచనాలున్న ఈ సినిమాకు ప్రాజెక్ట్ కు సంబంధించిన రానా అధికారికంగా త్వరలో ప్రకటించబోతున్నాడు.ఇక రానా సినిమాల విషయానికి వస్తే ఒక వైపు విరాట పర్వం సినిమా విడుదలకు సిద్దం అవుతుండగా మరో వైపు పవన్ కళ్యాణ్ తో కలిసి నటిస్తున్న భీమ్లా నాయక్ సినిమాను వచ్చే సంక్రాంతికి విడుదల చేయబోతున్నారు. మరో వైపు బాబాయితో కలిసి ఒక వెబ్ సిరీస్ ను చేస్తున్నాడు. అది ప్రముఖ ఓటీటీ అయిన నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవ్వబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో వైపు రానా హిందీలో కూడా రెండు సినిమాలకు సైన్ చేశాడు అనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి సినిమాలు.. వెబ్ సిరీస్ లతో బిజీగా ఉన్న రానా ఇప్పుడు ఓటీటీ తో పాటు పలు సంస్థలకు ప్రమోటర్ గా వ్యవహరిస్తున్నాడు. రానా హీరోగానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా.. విలన్ గా కూడా వరుసగా సినిమాలు చేస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకుని స్టార్ డమ్ ను దక్కించుకున్నాడు.

# రూ.100 సాదా చీరలో కత్రినా హొయలు!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ కెరీర్ పరంగా క్షణం తీరిక లేనంత బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇన్ స్టా లోనూ ఎంతో యాక్టివ్ గా ఉంటారు. నేటితరానికి ధీటుగా వేడెక్కించే ఫోటోషూట్లతో కత్రిన ముఖ్యంగా సినిమా అప్ డేట్లను.. విదేశీ విహార యాత్రల నుంచి ఎక్కువగా ఫోటోలు వీడియోలను అభిమానులకు షేర్ చేస్తున్నారు. ఇటీవలే 'టైగర్ -3' షూటింగ్ కోసం విదేశాల్ని చుట్టేస్తున్నామని కత్రిన వెల్లడించింది. అక్కడ అందమైన ఎగ్జోటిక్ లొకేషన్లను సైతం ఇన్ స్టాలో షేర్ చేసి ఫ్యాన్స్ ని ఖుషీ చేసింది.ఆస్ట్రియాలోని సాల్డ్ బర్గ్ లోని వంతెనపై కత్రినా నేచురన్ ఆస్వాధిస్తున్న ఫోటో ఒకటి వైరల్ గా మారింది. అందాల ఆరబోతే కాదు..అద్భుతమైన నేచర్ ని ఆస్వాధించడంలోనూ కత్రినా ముందుంటుందని ప్రూవ్ చేసింది. కత్రినా ఇన్ స్టా ఖాతా నుంచి చాలా కాలం తర్వాత అంత అందమైన గ్రీనరీ ఫోటో బయటకు రావడం ఫాలోవర్స్ ని బాగా ఆకట్టుకుంది. అంతకు ముందు ఇన్ స్టా వేదికగా హాట్ ఫోటోల్ని పోస్ట్ చేసి హాట్ కామెంట్లను ఫేస్ చేసిన హామ ఈసారి మాత్రం అందరి మనసుల్ని దోచుకుంది.తాజాగా కత్రినా వీటన్నిటికీ భిన్నంగా సంప్రదాయ చీరకట్టుతో చూపరులను ఆకట్టుకుంటోంది. కళ్లకు కాటుక...నుదుటిన నల్లటి బొట్టు.. లైట్ మ్యాకప్ తో నేచరల్ అందాన్ని లివేట్ చేసే ప్రయత్నం చేసింది. లైట్ కలర్ సాదా చీరకు..మ్యాచింగ్ జాకెట్ తో ట్రెడిషనల్ లుక్ లో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. చక్కనమ్మ చీర కడితే ఆ చీరకే వన్నె పెరిగిందా.. అనేంత అందంగా కనిపిస్తోంది. ఈ చీర ధర అందుబాటులోనే ఉంటుంది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. అభిమానులు స్వీటీ..క్యూటీ అంటూ తెగ పొగిడేస్తున్నారు.ఇక కత్రినా ప్రేమాయణం విషయానికి వస్తే.. యువహీరో విక్కీ విశాల్ తో పీకల్లోతు ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. వరుసగా టూర్లు... పార్టీల పేరుతో ఆ ఇద్దరూ చాలాసార్లు మీడియా కంట పడ్డారు. కానీ అది ప్రేమ కాదని...స్నేహం మాత్రమేని విక్కీ ఖండించే ప్రయత్నం చేసాడు. ఇక కత్రినా నటిస్తోన్న 'టైగర్ -3' విషయానికి వస్తే ఇప్పటికే చాలా భాగం విదేశాల్లో షూటింగ్ చేసారు. ఇందులో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మనీష్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. కత్రినను ఇండియన్ సూపర్ ఉమెన్ గా చూపించేందుకు టైగర్ జిందా హై దర్శకుడు కథ రాస్తున్న సంగతి తెలిసిందే.

# జూనియర్ పూరీ సెట్ అయినట్లేనా... ?




పూరీ జగన్నాథ్ టాలీవుడ్ లో డైనమిక్ డైరెక్టర్ గా చెబుతారు. ఆయన ఆలోచన వేరుగా ఉంటుంది. ఆ దృక్కోణం కూడా డిఫరెంట్ అని చెప్పాలి. అందరికీ ఇడియట్ లో తిట్టు వినిపిస్తే పూరీకి అద్భుతమైన ప్రేమికుడు కనిపించాడు. ఇక పూరీ పోకిరిలో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ ఉంటాడు. బిజినెస్ మెన్ అంటూ మహేష్ బాబు లాంట్ స్మార్ట్ హీరోతో మ్యాజిక్ చేసినా టెంపర్ అంటూ ఎన్టీయార్ లాంటి మాస్ హీరోని వేరే లెవెల్ లో చూపించినా పూరీకే చెల్లు. ఇక పూరీ మార్క్ డైలాగ్స్ ఎపుడూ చెవుల్లో మారు మోగుతూంటాయి. పూరీ కొత్త వారికి స్టార్ ఇమేజ్ తీసుకువచ్చి బ్లాక్ బస్టర్స్ ఇచ్చాడు. రవితేజా ని మాస్ మహారాజాని చేసిన క్రెడిట్ ఆయన సొంతంతన ఇంట్లో సొంత తమ్ముడు సాయి రామ్ శంకర్ ని పెట్టి కొన్ని సినిమాలు తీసి హిట్లూ ఫట్లూ రెండూ చూశాడు. ఇపుడు అదే పూరీ ఇంట్లో నుంచి వారసుడు ఆకాష్ హీరోగా ముందుకు వచ్చాడు. మెహబూబా మూవీతోనే హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఆకాశ్ ఈసారి పూరీ పర్యవేక్షణలో అనిల్ పాదూరి డైరెక్షన్ లో రొమాంటిక్ అంటూ జనాల ముందుకు వచ్చాడు. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినా కూడా హీరోగా ఆకాశ్ పూరీకి మంచి మార్కులే పడ్డాయి. ఆకాశ్ నటన గురించి చెప్పుకుంటే బాగా మెచ్యూరిటీ కనిపించింది అని అంతా అంటున్నారు. ఇక క్లైమాక్స్ సీన్లలో కూడా బాగా చేశాడు అని చెబుతున్నారు.మొత్తానికి ఆకాశ్ పూరీలోని ఫైర్ చాలానే ఉందని అంటున్నారు. చాన్నాళ్ళ తర్వాత టాలీవుడ్ కి జూనియర్ పూరీ రూపంలో యంగ్ బ్లడ్ తో కూడిన హీరో మెటీరియల్ లభించింది అంటున్నారు. మినిమం బడ్జెట్ లో సరైన కథ ఎంచుకుని ఆకాశ్ ని హీరోగా పెట్టి తీస్తే సేఫ్ జోన్ లో సక్సెస్ చూడడం ఖాయమని కూడా అంతా అంటున్నారు. ఇక పూరీ సమకాలీనులు అయిన డైరెక్టర్లు రాజమౌళి మెహెర్ రమేష్ వంటి వారు కూడా నటనాపరంగా శభాష్ ఆకాశ్ అన్నారు.ఆకాశ్ బాబాయ్ సినీ హీరో అయిన సాయి రామ్ శంకర్ అయితే అబ్బాయ్ రాకింగ్ అనేశాడు. నటనలో హావభావాలు పలికించడంలో ఆకాశ్ ఎక్కడికో వెళ్లిపోయాడని కితాబు ఇచ్చారు. పూరీ జగన్నాథ్ ది విశాఖ జిల్లా నర్సీపట్నం. దాంతో ఆ ఊరిలో అయితే అంతా సంబరాలే చేసుకుంటున్నారు. మా ఊరి కుర్రోడు హీరో అంటూ తెగ మురుస్తున్నారు. మొత్తానికి టాలీవుడ్ కి మరో స్మార్ట్ హీరో దొరికేశాడు ఆకాశ్ రూపంలో అంటున్నారు. సో. జూనియర్ పూరీ సరైన సబ్జెక్ట్ తో వస్తే కనుక టాలీవుడ్ లో సెట్ అయినట్లేనని చెబుతున్నారు అంతా.

# కోహ్లికి జట్టు నుంచి సపోర్ట్ లేదా?!



టి20 ప్రపంచకప్ 2021లో భాగంగా టీమిండియా దారుణ ఆటతీరు కనబరుస్తున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్, న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో భారీ తేడాతోనే పరాజయం పాలైంది. రెండు వరుస ఓటములతో టీమిండియాకు సెమీస్ అవకాశాలు దాదాపు మూసుకుపోయినట్లే. ఒకవేళ టీమిండియా సెమీస్ చేరాలంటే న్యూజిలాండ్ మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో రెండు ఓడిపోవాలి.. అదే సమయంలో అఫ్గనిస్తాన్ తనకు మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో ఓడిపోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది అసాధ్యం. కాబట్టి టి20 ప్రపంచకప్‌లో టీమిండియా పోరు సూపర్ 12 దశలోనే వెనుదిరగాల్సి వస్తుంది.ఈ విషయం పక్కడపెడితే తాజాగా ఒక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లికి జట్టు నుంచి ఎంతమాత్రం సపోర్ట్ లేదంటూ వార్తలు బయటికి రావడం ఆసక్తి కలిగించింది. కోహ్లికి టి20 కెప్టెన్‌గా ఇదే చివరి టి20 ప్రపంచకప్.. ఈ టోర్నీ తర్వాత అతను కెప్టెన్సీ నుంచి వైదొలగనున్నాడు. ఈ నేపథ్యంలోనే ఒకవేళ టీమిండియా కప్ గెలవకపోతే ఆ ప్రభావం కోహ్లిపై పడుతుందనే ఉద్దేశంతోనే ఆటగాళ్లు సపోర్ట్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు ధోనిని బీసీసీఐ ఏరికోరి మెంటార్‌గా తీసుకొచ్చింది.అయితే ధోని చెప్పిన సూచనలు కోహ్లి పెడచెవిన పెట్టాడని..కెప్టెన్‌గా సొంత నిర్ణయాలు తీసుకోవడంతో న్యూజిలాండ్, పాక్ మ్యాచ్‌ల్లో టీమిండియా ఓటమికి పరోక్షంగా కారణమయ్యాయని సమాచారం. ఈ వార్తల్లో నిజం ఎంత అనేది తెలియకపోయినప్పటికి న్యూజిలాండ్, పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో కనిపించిందంటూ ఫ్యాన్స్ పేర్కొన్నారు.

## కోహ్లి వ్యూహాలను ఏకి పారేసిన గంభీర్

టీ20 ప్రపంచకప్-2021లో న్యూజిలాండ్ చేతిలో టీమిండియా ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్న నేపథ్యంలో భారత మాజీ ఓపెనర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ అసంతృప్తిని వ్యక్తం చేశాడు. కివీస్‌తో కీలక మ్యాచ్‌కు కోహ్లి సేన రాంగ్ మైండ్ సెట్‌తో బరిలోకి దిగిందని, నాలుగు శతకాలు బాదిన రోహిత్ శర్మను ఓపెనర్‌గా కాకుండా వన్ డౌన్‌లో ఎలా ఆడిస్తారని ధ్వజమెత్తాడు. జట్టులోని ఆటగాళ్లకు నైపుణ్యమున్నా.. మానసిక స్థైర్యం కొరవడిందని, ఆ కారణంగానే కివీస్ చేతిలో చిత్తు అయ్యిందని అభిప్రాయపడ్డాడు. సాధారణ మ్యాచ్‌ల్లో చెలరేగిపోయే కోహ్లి సేనకు కీలక మ్యాచ్‌ల్లో చేతులెత్తేయడం అలవాటుగా మారిందని అసహనం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా కివీస్‌తో మ్యాచ్‌లో కోహ్లి అనుసరించిన వ్యూహాలను ఏకి పారేశాడు. 112 మ్యాచ్‌ల కెరీర్‌లో కేవలం 2 మ్యాచ్‌ల్లో మాత్రమే వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన రోహిత్‌ను...కీలక మ్యాచ్‌లో ఆ స్థానంలో ఎలా ఆడిస్తారని నిలదీశాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190